# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 27-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:204 పేజీలు:6 వెల: రూ.1/-


## మాల్దీవుల సముద్ర జలాల్లో చైనా నౌక

మాలే(మాల్దీవులు)ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : మాల్దీవుల జల్లాలోకి తిరిగి అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానపు పరిశోధనల నౌక వచ్చి చేరింది. 4500 టన్నుల బరువైన ఈ సముద్ర పరిశోధన నౌక ప్రవేశం సరిగ్గా దేశాధ్యక్షులుగా మెహ్మద్ ముయిజ్జు రెండోసారి మరింత బలీయ స్థితిలో అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే జరిగింది. ఈ దీవుల సముదాయపు దేశపు వివిధ రేవులలో నిలుస్తూ వచ్చిన రెండు నెలలకు ఇప్పుడు ఈ చైనా నౌక సముద్ర జలాల్లోకి చేరుకుంది. గురువారం ఉదయం చైనాకు చెందిన జియాంగ్ యాంగ్ హాంగ్ 03 భారీ నౌక మాల్దీవులకు చెందిన తిలఫుషి పారిశ్రామిక దీవుల నౌకాశ్రయానికి చేరుకుందని న్యూస్‌పోర్టల్ అధాధూ డాట్‌కామ్‌లో తెలిపారు. చిరకాలంగా భారత వ్యతిరేకత చాటుకుంటున్న ముయిజ్జు పార్టీ ఈసారి మరింత బలంగా అధికారంలోకి రావడంతో ఈ పార్టీ ప్రభుత్వం ఇక తన చైనా అనుకూల వాదాన్ని మరింతగా చాటుకుంటుందని ఈ నౌక రాకతో స్పష్టం అయింది.

**చురక**

విశ్వాసం భక్తి పేర
విభజన రాజకీయం
సమాజాన్ని ఓట్లకొరకు
చేస్తున్నరు విషగాయం.
సకలజనం సామరస్య
శాంతి సుఖం కొరుకునే
ఏ దేవుడు తనను నేడు
ఎన్నికల్లోకి ఈడ్చుమనే



-వేల్పుల నారాయణ

# సుప్రీంకోర్టు తీర్పు ప్రతిపక్షాలకు చెంపపెట్టు

### -ఇవిఎంలపై ఏడుపు ఆపి దేశానికి క్షమాపణ చెప్పండి
### -ప్రతిపక్షాలకు ప్రధాని మోడీ డిమాండ్

పాట్నా ఏప్రిల్ 26 ( ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఇవిఎంల ద్వారా వేసే ఓటును ఓటర్ వెరిఫైయబుల్ ఆడిట్ ట్రెయిల్(వివిప్యాట్)తో క్రాస్ చెక్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం ప్రతిపక్షాలకు చెంపపెట్టని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఇందుకు గాను ప్రతిపక్షాలు దేశానికి క్షమాపణ చెప్పాలని కూడా ప్రధాని డిమాండ్ చేశారు. బీహార్‌లోని అరారియాలో శుక్రవారం ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగిస్తూ మన ప్రజాస్వామ్యానికి నేడు ఒక సుదినమని అన్నారు. ఇవిఎంల మీద ఏడ్చే ప్రతిపక్షాల మొహంపైన సుప్రీంకోర్టు చెంపదెబ్బ కొట్టిందని ఆయన చెప్పారు. మన ప్రజాస్వామ్యాన్ని, మన ఎన్నికల ప్రక్రియను ప్రపంచమంతా శ్లాఘిస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం తమ రాజకీయ ప్రయోజనాల కోసం అప్రతిష్ట పాల్జేస్తున్నాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై మరోసారి ధ్వజమెత్తుతూ ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిల హక్కులను లాక్కునేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని మోడీ ఆరోపించారు. తాను ఈ విషయాన్ని ఎంతో బాధ్యతతో చెబుతున్నానని ఆయన అన్నారు. భారత్‌లో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండకూడదని బాబా సాహెబ్ అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని, కాని కాంగ్రెస్ మాత్రం మతపరమైన రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. కర్నాటక తరహా రిజర్వేషన్ల విధానాన్ని దేశమంతటా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ఓబిసి వర్గానికి ద్రోహం చేస్తూ ఆర్థికపరమైన స్థితిగతులకు అతీతంగా కర్నాటకలోని ముస్లింలందరినీ ఓబిసి జాబితాలో చేర్చిందని ఆయన ఆరోపించారు. బీహార్‌లోని ఆర్‌జెడి-కాంగ్రెస్ కూటమిపై మండిపడుతూ వారికి భభూరతదేశ రాజ్యాంగమంటే ఏమాత్రం లెక్కలేదని ఆరోపించారు. దశాబ్దాలుగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా అడ్డుకున్నారని ఆయన చెప్పారు. ఇప్పుడు పేదలు, నిజాయితీపరులైన ఓటర్లకు ఇవిఎం బలం లభించడంతో ఇవిఎంల వదిలించుకోవడానికి ఆ రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆయన చెప్పారు.

# భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావుల బెయిల్ పిటిషన్లు తిరస్కరణ

### -రాధాకిషన్ రావు బెయిల్ పిటిషన్ విచారణ 29కి వాయిదా
### -పోలీసుల వాదనలతో ఏకీభవించిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు నాంపల్లి కోర్టు బెయిల్‌ను నిరాకరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావుల బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. రాధాకిషన్ రావు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్లపై పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం వారి బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై అంతకు ముందు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ స్పందించారు. ఈ కేసుకు సంబంధించి విచారణ సాగుతోందన్నారు. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయలేదని తెలిపారు. ఈ కేసులో చాలామంది ప్రమేయం ఉందని తెలుస్తోందన్నారు. ప్రభాకర్ రావును పట్టుకోలేదనేది అవాస్తవమన్నారు. దర్యాప్తు అధికారులకు ప్రభాకర్ రావు అందుబాటులోకి రాలేదన్నారు. సరైన సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసు వివరాలను వెల్లడిస్తామన్నారు.

# బిజెపి అంటే బ్రిటీష్ జనతా పార్టీ : రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీపై విరుచుకుపడ్డారు. రిజర్వేషన్లు రద్దు చేయాలనేది బిజెపి విధానమని సిఎం ఆరోపించారు. ఆనాడు బ్రిటీషర్లు సూరత్ చేరుకుని క్రమంగా దేశమంతా ఆక్రమించుకన్నారని, ఇప్పుడు సూరత్ వ్యాపారులు దేశాన్ని ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. బిజెపి అంటే బ్రిటీష్ జనతా పార్టీ అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బ్రిటీష్ వాల్ల వలే బిజెపి వాళ్లకు కూడా రిజర్వేషన్లు నచ్చవన్నారు. నేను ఉంటే తన కుట్రలు సాగవని కెసిఆర్, కెటిఆర్ భావిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను ఎంపి ఎన్నికల్లో మరోసారి తిప్పికొట్టాలని ప్రజలను సిఎం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సైనికులు మరోసారి అవిశ్రాంతంగా పోరాడాలని రేవంత్ రెడ్డి కోరారు. కార్పొరేట్ కంపెనీల కుట్రలో భాగంగా రిజర్వేషన్లు రద్దు చేయాలని బిజెపి భావిస్తోందన్నారు. ఇప్పటికే రూ. 60లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సంస్థలను మోడీ అమ్మేశారని ఆయన ఆరోపించారు. 13 మంది ప్రధానులు చేసిన అప్పుకంటే రెట్టింపు అప్పు నరేంద్ర మోడీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత అప్పు ఎందుకు చేశారని అడిగితే 'అయోధ్యలో గుడిలో కట్టానని అంటారు.. 'జైశ్రీరామ్ అంటారు' అని ఆయన వెల్లడించారు. కెసిఆర్ కూడా ఎందుకు ఇంత అప్పు చేశారని అడిగితే 'జై తెలంగాణ' అన్నారు అని గుర్తుచేశారు. ఇన్నాళ్లు బిజెపి వాళ్లు రాముడి ముసుగు వేసుకుని రాజకీయం చేశారు.

# తూర్పు ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న భారీ వర్షాలు.. టాంజానియాలో 155 మంది మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: తూర్పు ఆఫ్రికా దేశాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు టాంజానియా , కెన్యా, బురుండీల్లో వరదలు సంభవించాయి. దీంతో ఆయా దేశాల్లో పరిస్థితులు దయనీయంగా మారాయి. పలు ప్రధాన నదులు ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలకు టాంజానియా దేశంలో సుమారు 155 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ప్రధాని కాసిమ్ మజాలివా తాజాగా వెల్లడించారు.

బలమైన గాలులు, వరదల కారణంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట నష్టంతోపాటు రోడ్లు, వంతెనలు, రైల్వేలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పలు చోట్ల కొండచరియలు కూడా విరిగిపడినట్లు చెప్పారు. ఈ వర్షాల కారణంగా సుమారు 236 మంది గాయాలపాలైనట్లు తెలిపారు.

51 వేలకు పైగా ఇల్లు ధ్వంసమయ్యాయని, సుమారు రెండు లక్షల మంది వరదలకు ప్రభావితమయ్యారని ప్రధాని కాసిమ్ పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమర్జెన్సీ సర్వీసెస్ సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వదల్లో చిక్కుకుపోయిన వారిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివరించారు. మే నెలలో కూడా వర్షాలు కొనసాగుతాయని కాసిమ్ హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభావిత ప్రాంతాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

ఇక టాంజానియా పొరుగు దేశాలైన కెన్యా, బురుండీలలో కూడా భారీ వర్షాల కారణంగా పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. కెన్యాలో వర్షాల కారణంగా 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. తూర్పు ఆఫ్రికా ప్రాంతం ప్రస్తుత వర్షాకాలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు తెలిపారు.

# మోసం చేసింది కేసీఆరే

### -దళితుడ్ని ముఖ్యమంత్రి చేశారా..
### -మూడెకరాలు ఇచ్చారా..
### -హరీష్ చేస్తున్నవి డ్రామాలే
### -కాగితాలపై పిచ్చి రాతలతో రాజీనామాలా
### -మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26: ఎన్నికల్లో ఇచ్చిన విధంగా రైతులకు రెండు లక్షలు రుణమాఫీ హామీ నిలబెట్టుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు మూడెకరాల పేరుతో కేసీఆర్ మోసం చేశారని, ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కూడా కల్పించలేదని మండిపడ్డారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ? అధికారం పోగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిచ్చిపట్టినట్టు మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ వస్తే సీఎం అయ్యేది దళితుడేనని కేసీఆర్ చెప్పారని, దళితుడిని సీఎం చెయ్యకుంటే మెడపై తల ఉండదని గొప్పలు చెప్పారని గుర్తుచేశారు. తొలిసారి పరిపాలన అనుభవం ఉండాలనే తాను సీఎం అయ్యానన్న కేసీఆర్, రెండోసారి కూడా దళితుడిని సీఎం చెయ్యలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాగా, గతంలో తాను మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నానని, ఇప్పుడు ఎమ్మెల్యే పదవిని వదులుకునేందుకు హరీశ్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రైతులపై ప్రేమ ఉన్నట్టు హరీశ్ నాటకాలు ఆడుతున్నారన్నారు. రాజీనామా పత్రం ఒకటిన్నర లైన్ మాత్రమే ఉండాలని, కానీ హరీశ్‌రావు ఒకటిన్నర పేజీ రాసుకొచ్చారని విమర్శించారు. ఇప్పటివరకు 40కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేస్తున్నారని, మార్చి 1న ఉచిత విద్యుత్ బిల్లు వచ్చిందో, లేదో తెలుసుకోవాలని కోమటిరెడ్డి సూచించారు.

మెదక్ లో బీఆర్ ఎస్ కు డిపాజిట్ రాదు..

లోక్‌సభ ఎన్నికల్లో మెదక్‌లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా రాదని వెంకట్‌రెడ్డి జోస్యం చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఫాంహౌస్ నుంచి బయటకు రాని కేసీఆర్, ఇప్పుడు కర్రపట్టుకుని బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మూడు నెలల్లో 60సార్లు సచివాలయానికి వచ్చారని గుర్తుచేశారు. పార్టీ మూతపడే స్థితికి చేరుకోవడంతో ఆ పార్టీ నేతలకు ఎక్కడికి వెళ్లాలో వారికి అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కొనసాగుతున్న విచారణ- సీపీ శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26: ఫోన్ ట్యాపింగ్ కేసులో చాలా సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నామని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసులో కీలక నిందితుడైన అప్పటి ఇంటలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును పట్టుకోవడం లేదనే వాదన తప్పు అని ఆయన తెలిపారు. ప్రభాకర్‌ను ఇండియాకు రప్పించే యత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు.

అదేవిధంగా ప్రభాకర్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వలేదని, లుక్ అవుట్ నోటీసులు మాత్రం జారీ చేశామని వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటర్‌పోల్‌ను సంప్రదించలేదని సీపీ క్లారిటీ ఇచ్చారు. ట్యాపింగ్ ఏ స్థాయిలో జరిగిందనే విషయం త్వరలోనే తేలుస్తామన్నారు. సమయం వచ్చినప్పుడు కేసుకు సంబంధం ఉన్న రాజకీయ నాయకుల వ్యవహారంపై కూడా స్పందిస్తామని సీపీ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# సుప్రీం కోర్టు, హైకోర్టుల తీర్పు- ఇసి అధికారుల వెల్లడి




న్యూఢిల్లీ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బ్యాలట్ పత్రాల పద్ధతిని తిరిగి అనుసరించాలన్న అభ్యర్థనలను సుప్రీం కోర్టు తిరస్కరించిన రోజు శుక్రవారం ఎన్నికల కమిషన్ (ఇసి) అధికారులు స్పందిస్తూ, ఇవిఎంల విశ్వసనీయతను సవాల్ చేస్తున్న పిటిషన్లను కనీసం 40 సందర్భాల్లో రాజ్యాంగ న్యాయస్థానాలు తోసిపుచ్చాయని వెల్లడించారు. ఇవిఎంలు 'నూరు శాతం భద్రం' అని, ఆ మెషీన్లు న్యాయమైనవేనని రాజకీయ పార్టీలకు 'అంతరాంతరాల్లో' తెలుసునని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ చెప్పినట్లు ఇసి అధికారులు పేర్కొన్నారు. ఇవిఎంలలో పడిన వోట్లను వివిప్యాట్ స్లిప్‌లతో పూర్తిగా సరిపోల్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తిరస్కరించింది. ఇవిఎం విధానంలోని ఏదైనా అంశంపై 'గుడ్డిగా అపనమ్మకం పెట్టుకోవడం' అవాంఛిత విమర్శకు దారి తీస్తుందని కోర్టు స్పష్టం చేసింది. 'ప్రజాస్వామ్యం అన్ని వ్యవస్థల మధ్య సామరస్యాన్ని, నమ్మకాన్ని నిర్మించేందుకు కృషి చేయడం గురించే' అని పేర్కొంటూ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం రెండు ఏకీకృత తీర్పులు వెలువరించింది.

ఎన్నికల్లో తిరిగి బ్యాలట్ పత్రాల విధానాన్ని అనుసరించాలని కోరుతున్న పిటిషన్లతో సహా ఈ వ్యవహారంలో అన్ని అర్జీలను బెంచ్ కొట్టివేసింది. సిఇసి రాజీవ్ కుమార్ లోక్‌సభ ఎన్నికల కార్యక్రమాన్ని మార్చి 16న ఢిల్లీలో విలేకరుల గోష్ఠిలో ప్రకటిస్తూ, 'ఇవిఎంలను సవాల్ చేస్తున్న పిటిషన్లను దాదాపు 40 సార్లు రాజ్యాంగ న్యాయస్థానాలుడ సుప్రీం కోర్టు, హైకోర్టులు తిరస్కరించాయి' అని తెలియజేశారు. ఇసి ప్రచురణ ఒకదానిని ఆయన ఉటంకిస్తూ, ఇవిఎంల ఉపయోగించిన ఎన్నికల్లో అధికార పార్టీలు ఎన్ని సార్లు ఓడిపోయాయో అది సూచిస్తోందని తెలిపారు. 'ఇవిఎంల కారణంగానే రాజకీయ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. చిన్న పార్టీలు అనేకం బ్యాలట్ పత్రాల శకంలో ఉనికిలోకి వచ్చి ఉండకపోవచ్చు' అని ఆయన చెప్పారు. ఇవిఎంలు నిష్పక్షపాతమైనవని, రాజకీయ పార్టీలు 'అంతరాంతరాల్లో' ఆ విషయం గుర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'వాటిని 'నూరు శాతం భద్రమైనవి, నూరు శాతం నమ్మకమైనవి' అని కూడా రాజీవ్ కుమార్ అభివర్ణించారు.

# జంగారెడ్డిగూడెంలో విషాదం.. వాగులో మునిగి ముగ్గురు మృతి

అమరావతి, ఏప్రిల్ 26: ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం జల్లేరు వాగు లో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి ముగ్గురు మృతి చెందారు. మృతులు ఊట్లపల్లి, దిబ్బగూడానికి చెందిన రేష్మ(24), మొహిషాద్(23), హసద్(14)గా గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సికింద్రాబాద్ నియోజకవర్గం నుండి శివసేన పార్టీ అభ్యర్థిగా సుదర్శన్ నామినేషన్

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); సికేంద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి శివసేన పార్టీ అభ్యర్తి గా ఆంధ్రపు సుదర్శన్ గంగపుత్ర గా నామినేషన్ దాఖలు చేసారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే ఉపిరి రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల మీద పోరాటం ఇంకా ఉదృతం చేస్తానని అన్నారు. నియోజకవర్గ మిత్రులకు కుటుంబ సభ్యులకు అందరికి పేరు పేరు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఎం ల్ ఏ గా అభ్యర్థిగా ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేయడం జరిగింది ప్రజలు నేను చేసినటువంటి పోరాటాలను రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల మీద పోరాటం ఇంకా ఉదృతం చేస్తానని తెలియజేస్తున్నాను.

**నేటి కందం- నేటికీ అందం**

పశుపాలుడు హర్షించగ
పశుపతి సంతసము నొంద ప్రతివత్సరమున్
పశువుల స్వాస్థ్యము గోరుచు
పశువైద్య దినోత్సవమును బాటింపవలెన్



(ఏప్రియల్ 27 : ప్రపంచ పశువైద్య దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210




# మానవాభివృద్ధికి తోడవుతున్న సాదు జంతువులు !

## (27 ఏప్రిల్ "ప్రపంచ పశువైద్య దినం" సందర్భంగా)

ప్రపంచ పశువైద్య దినోత్సవం–2024 నినాదంగా "పశువైద్యులు అవసరమైన ఆరోగ్య కార్యకర్తలు (వెటర్నరేనియన్స్ ఆర్ ఎసెన్షియల్ హెల్త్ వర్కర్స్)" అనే అంశాన్ని ఎన్నుకొని ప్రపంచ దేశాలు ఏప్రిల్ మాస చివరి శనివారం, అనగా ఏప్రిల్ 27, 2024న పలు ప్రజాప్రయోజన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మానవ ఉపయుక్త జీవకోటి ఆరోగ్య పరిరక్షణలో పశువైద్యులు అమూల్యమైన సేవలు అందిస్తూ మానవాళి శారీరక, మానసిక, సమాజ శ్రేయస్సుకు దోహదపడుతున్నారని ప్రజానీకం తెలుసుకోవాలి. పశువైద్యుల సేవలు పరోక్షంగా ప్రజారోగ్య సంరక్షణ, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక భద్రత, జీవావరణ వ్యవస్థ,ఔషధాల ఉత్పత్తి, బయోమెడికల్ పరిశోధనలు, గ్రామీణాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి, జీవ వైవిధ్య పరిరక్షణ, జునోటి వ్యాధుల చికిత్సలు లాంటి అంశాలకు ఊతం ఇస్తున్నారు. పశువైద్య వృత్తి నిపుణులకు పౌర సమాజం తగిన గుర్తింపు ఇవ్వకపోవడం విచారకరమే కాదు ఆక్షేపణీయం కూడా.

**పశు వైద్యుల నిబద్ధత ప్రశంసనీయం:**

1761లో తొలిసారి ఫ్రాన్స్‌లో పశువైద్య పాఠశాల నెలకొల్పడం జరిగింది. 1863లో ఆచార్య జాన్ గంఘీ చొరవతో ఎడిన్‌బర్గ్‌లో ప్రథమ 'ప్రపంచ పశువైద్య కాంగ్రేస్' ఏర్పాటు చేయబడింది. 1959లో "ప్రపంచ పశువైద్య సంఘం" ఏర్పాటు కావడం, 2000ల నుంచి "ప్రపంచ పశువైద్య దినం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. పశువైద్య వృత్తిలో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు 2008 నుంచి "ప్రపంచ పశువైద్య అవార్డు" ప్రదానం చేయడం ఆచారంగా మారింది. ప్రజారోగ్య వైద్యుల కన్న పశువైద్యుల వృత్తి, నిబద్ధత ప్రశంసనీయం. రోగి వైద్యుడికి తమ సమస్యను, అనారోగ్య ఇబ్బందులను వివరిస్తాడు, కాని నోరులేని పశువులు తమ ఇబ్బందులను చెప్పలేవు. అయినప్పటికీ ఆ జంతువుల నిశ్శబ్ద భాషను తెలుసుకొని నిస్వార్థంగా సత్వర ఉపశమన వైద్యం చేయడం హర్షదాయకం. జంతువుల గాయాలు, రోగాలను పసిగట్టి తగు వైద్యం చేయడంలో పశువైద్యులు చూపే విజ్ఞత, విషయపరిజ్ఞానం ప్రశంసనీయం.

**భారత్‌లో పశువైద్య సదుపాయాలు:**

భారత్‌లో అనేక ప్రైవేట్, ప్రభుత్వ రంగాలు అందించే పశువైద్య ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండడం సంతోషదాయకం. భారత సమాజం అనాదిగా సాగు జంతువులు, పశువులతో మమేకమై జీవితాలను గడుపుతున్నారు. పశువు లేదా జంతువు, యజమాని, పశు వైద్యుల మధ్య విడదీయరాని సంబంధం ఉండాలి. పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, గుడ్ల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉన్నది. పశువైద్య సదుపాయాల కొరత, పశు వైద్య నిపుణుల కొరత, పెట్టుబడుల్లో కోత, డిజిటలైజేషన్‌కు అనుగుణంగా అప్‌డేట్ కావడంలో మందగమనం లాంటి పలు పశువైద్య సమస్యలు భారతాన్ని పట్టి పీడిస్తున్నాయి. నేడు దేశవ్యాప్తంగా దాదాపు 55,000 పశువైద్యుల కొరత వెంటాడుతున్నది. దేశంలో 31 శాతం పశువైద్యశాలల్లో అవసర సదుపాయాలు ఉన్నట్లు, 40 శాతం పశువైద్యులు అత్యవసర చికిత్స విభాగంలో నైపుణ్యాలు కలిగిలేరని తేలింది. 2025 నాటికి పశువైద్య మార్కెట్ మరో 7.5 శాతం వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

**ముఖ్యమైన పెంపుడు జంతువులు:**

వెటర్నరీ కోర్సులు జంతు ప్రేమికులకు సరైనవిగా అందుబాటులో ఉన్నాయి. అభిరుచి కలిగిన ఔత్సాహికులు పశువైద్య కోర్సులు పూర్తి చేసి వృత్తికి పరిపూర్ణ న్యాయం చేయవచ్చు. భారతదేశంలో గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు, కుందేళ్లు, పిల్లులు, కుక్కలు, గుర్రాలు, కోళ్లు మొదలగునవి సాదు జంతువులుగా గ్రామీణ, పట్టణ ప్రజల జీవితాలతో విడదీయరాని బంధాన్ని పెనవేసుకున్నాయి. సాదు జంతువుల్లో ప్రధానమైనదిగా కుక్కలు వస్తాయి. భారత కుటుంబాల్లో 34 శాతం వరకు కుక్కలు, 20 శాతం వరకు పిల్లులు సాదు జంతువులుగా పెరుగుతున్నాయి. దాదాపు 41 శాతం వరకు కుటుంబాల్లో సాదు జంతువులు లేవని తెలుస్తున్నది. నేడు భారతవ్యాప్తంగా 30 మిలియన్లకు పైగా పెంపుడు కుక్కలు ఉండగా, వీధి కుక్కల బెడద ప్రజలను వెంటాడుతున్నది.

**మూగజీవాలకు ఆరోగ్య గొడుగు పడదాం:**

విశ్వాసానికి మారు పేరైన పెంపుడు జంతువులు కొన్ని కుటుంబాల్లో సభ్యులుగా మారిపోయినప్పటికీ, వాటి నుంచి సంక్రమించే జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలి. పెంపుడు జంతువులను తరుచుగా వైద్యుల వద్దకు తీసుకెళ్లడం, పరిశుభ్రతపైప్రత్యేక శ్రద్ధ వహించడం, టాయిలెట్ మ్యాట్స్/లిట్టర్ బ్యాక్స్‌లను దూరంగా పెట్టడం, ఆ ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం, అవసరమైతే సంతానం కలుగకుండా ఆపరేషన్ చేయించడంతో లాంటి జాగ్రత్తలు పాటిస్తే ప్రాణాంతర ఇన్ఫెక్షన్లు సోకవు.

నోరులేని జంతువులకు ఆరోగ్య భాగ్యాలను కల్పిస్తూ ప్రాణం పోస్తున్న పశువైద్యులను ఈ రోజున ఘనంగా సన్మానించుతుందాం, జంతువుల పరిరక్షణకు కంకణబద్ధులం అవుదాం. పశుసంపదలు గ్రామీణ ప్రజల జీవనాధార పునాదులని, వ్యవసాయానికి అనుబంధంగా పశు సంపదలు రైతులకు ఆర్థిక ఉపశమనాన్ని కలిగిస్తున్నాయని, పాడిపశువులు గ్రామీణ కుటుంబాల్లో ఆదాయ మార్గాలని తెలుసుకొని వాటి ఆరోగ్య పరిరక్షణలో పశువైద్యులను పాత్రులను చేద్దాం, కృతజ్ఞతలు సమర్పిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# చాన్స్ ఇస్తే.. ఏం చేశావ్ జగన్‌పై షర్మిల గరం గరం



అమరావతి, ఏప్రిల్ 26: జగన్‌ను నమ్మి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నట్టేట ముంచాడని, ఇప్పుడు రాష్ట్ర ప్రజలు చింతిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పిన జగన్.. అయిదేళ్లు గడిచినా ఆ ఊసే ఎత్తడంలేదని, ఇచ్చిన హామీని ఎలా మరిచిపోయారని ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఎంపై ఆమె విమర్శల వర్షం కురిపించారు.. రాష్ట్ర ప్రజల గురించి, ప్రజల బిడ్డల భవిష్యత్ గురించి జగన్ ఆలోచించడంలేదన్నారు. సీఎం అయ్యాక ప్రత్యేక హోదా విషయాన్ని పూర్తిగా మరిచిపోయారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎంత ముఖ్యమో? సీఎంకు తెలియదా.. తెలిసీ ఎలా మరిచిపోయారని ఆమె ప్రశ్నించారు. పరిపాలనా సౌలభ్యం కోసం, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని వైసీపీ చీఫ్, ముఖ్యమంత్రి హోదాలో హామీ ఇచ్చారని షర్మిల గుర్తు చేశారు. ఐదేళ్లు గడిచినా ఒక్క రాజధానిని కూడా ఏర్పాటు చేయలేదని, రాష్ట్ర రాజధాని ఏదంటే జవాబివ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. జగన్ పాలనలో రైతులంతా అప్పులపాలయ్యారని షర్మిల ఆరోపించారు.

ధరల స్థిరీకరణ కోసం రూ.3 వేల కోట్లతో నిధి ఏర్పాటు చేస్తానని జగన్ హామీ ఇచ్చారని, ఆ హామీ ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. కనీసం ఒక్క ఏడాదైనా రైతుల కోసం రూ. 3 వేల కోట్లు పక్కన పెట్టారా? పంట నష్టపోయిన రైతులను ఆదుకున్నారా? సంక్రాంతికి జాబ్ క్యాలెండర్ ఎక్కడ? అని షర్మిల ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను మరచి, రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించని జగన్‌కు మీ చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో సరైన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు.

**ఇక తెరమీదకు కాంగ్రెస్ తారాగణం**

ఏపీలో ఎన్నికల ప్రచారం చేసే కాంగ్రెస్ నేతలను పార్టీ ఖరారు చేసింది. కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు షర్మిల ప్రధాన ప్రచారం కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్, ఖర్గే, ప్రియాంక తో సహా 40 మందిని ప్రకటించారు. వీరిలో తెలంగాణ రాష్ట్రం నుంచి 11 మంది ఉన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు ఉన్నారు. వీరితోపాటు మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత అజారుద్దీన్, మరో కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ కూడా స్టార్ క్యాంపెయినర్లుగా చోటు లభించింది.

**రేవంత్ రాకతో.. వైసీపీకి చుక్కలే.. కూటమికీ దడే**

కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం బీజేపీ. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఉన్నాయి. గతంలో విశాఖలో పార్టీ సభకు హాజరైన రేవంత్ అటు జగన్?ఇటు చంద్రబాబును టార్గెట్ చేసారు. షర్మిల సైతం ఇద్దరు నేతలు మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు హోరాహోరీగా మారుతున్న ప్రచారంలో రేవంత్, పార్టీ నేతలు ఏపీలోకి ఎంట్రీ ఇస్తే ఎన్నికల రాజకీయం మరింత ఉత్కంఠగా మారే అవకాశం కనిపిస్తోంది.

# ఒక క్రొత్త గుర్తింపు చిహ్నాన్ని మరియు ఆదర్శ వాక్యాన్ని స్వీకరించిన ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిశన్ (ఐహెచ్‌ఆర్‌సి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పాత దస్తావేజుల సంబంధి వ్యవహారాలలో సలహాలను ఇచ్చేటటువంటి అత్యున్నత సంస్థ ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిశన్ (ఐహెచ్‌ఆర్‌సి). ఈ సంస్థ ప్రాచీన ప్రతుల సంరక్షణ మరియు చారిత్రిక పరిశోధన కోసం వాటిని ఉపయోగించే విషయం లో భారత ప్రభుత్వానికి సలహాలను సూచనలను ఇవ్వడం కోసం రచయితలు, సంరక్షకులు మరియు ప్రాచీన దస్తావేజులను ఉపయోగించుకొనే వారికి ఉద్దేశించిన ఒక అఖిల భారతీయ స్థాయి వేదిక వలె పనిచేస్తూ ఉంది. ఈ సంస్థను 1919 వ సంవత్సరం లో ఏర్పాటు చేయడమైంది. ఐహెచ్‌ఆర్‌సి కి సంస్కృతి మంత్రిత్వ శాఖ నాయకత్వాన్ని వహిస్తోంది.

ఐహెచ్‌ఆర్‌సి యొక్క విశిష్టమైన గుర్తింపు ను మరియు ఆ సంస్థ ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యత ను గురించిన అవగాహన ను ప్రజల లో వ్యాప్తి చేయడం కోసం ఒక గుర్తింపు చిహ్నాన్ని మరియు ఒక ఆదర్శ వాక్యాన్ని పంపండంటూ పిలుపు ను ఇవ్వడమైంది. ఇందుకోసం 2023 వ సంవత్సరం లో మైగవ్ పోర్టల్ లో ఒక ఆన్ లైన్ పోటీ ని ప్రారంభించడమైంది. ఈ ఆహ్వానానికి ప్రతిస్పందన గా మొత్తం 436 దరఖాస్తు లు అందాయి.

ఈ పోటీ లో దిల్లీ కి చెందిన శ్రీ శౌర్య ప్రతాప్ సింహ్ దాఖలు చేసిన ఈ క్రింది గుర్తింపు చిహ్నం మరియు ఆదర్శ వాక్యం లతో కూడిన ఎంట్రీ ని విజేత గా ఎంపిక చేయడమైంది :

ఈ గుర్తింపు చిహ్నం ఐహెచ్‌ఆర్‌సి యొక్క ప్రధాన ఉద్దేశ్యాన్ని మరియు విశిష్టత ను పూర్తి గా ప్రస్ఫుటం చేస్తున్నది. తామర పూవు రేకుల ఆకృతి లో ఉన్న పుటలు ఐహెచ్‌ఆర్‌సి చారిత్రక రికార్డుల నిర్వహణ లో ఎదురయ్యే ఆటుపోటుల ను తట్టుకొని నిలబడగలిగే నోడల్ సంస్థ గా చాటి చెబుతున్నాయి. మధ్య లో చిత్రించిన సారనాథ్ స్తంభం భారతదేశం యొక్క వైభవోపేతమైన గత కాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఈ బొమ్మ కు ఎంచుకొన్న గోధుమ వన్నె సంస్థ యొక్క ధ్యేయం అయినటువంటి భారతదేశ చారిత్రక రికార్డుల ను సంరక్షించడం, అధ్యయనం చేయడం మరియు గౌరవించడం అనే టటువంటి కమిశన్ యొక్క మిశను ను సుదృఢం చేస్తోంది.

ఆదర్శ వాక్యం యొక్క అనువాదాన్ని చూశామంటే "ఎక్కడైతే చరిత్ర భవిష్యత్తు కోసం పదిలం గా ఉందో." అనే భావం దీనిలో వ్యక్తమవుతున్నది. ఈ ఆదర్శ వాక్యం ఐహెచ్‌ఆర్‌సి అన్నా, ఐహెచ్‌ఆర్‌సి యొక్క కృషి అన్నా గొప్ప ప్రాధాన్యం కలిగిందిగా ఉందని చాటుతోంది. ఐహెచ్‌ఆర్‌సి చారిత్రిక దస్తావేజు లు, లిఖిత ప్రతులు మరియు చారిత్రిక సమాచారం యొక్క ఇతర సాధనాల ను గుర్తించడం, సేకరించడం, వాటిని పట్టికీకరించడం లతో పాటు సంబాళించడం లో కీలకమైన భూమిక ను పోషిస్తున్నది. ఈ విధుల ను నిర్వర్తించడం ద్వారా కమిశన్ భావి తరాల వారి కోసం విలువైన చారిత్రిక జ్ఞానాన్ని సంరక్షించేందుకు పూచీ పడుతున్నది. ఈ కారణం గా ఈ యొక్క ఆదర్శ వాక్యం చారిత్రిక దస్తావేజు పత్రాల ను సురక్షితం గా ఉంచడం మరియు వాటిని వర్తమాన తరం, ఇంకా భవిష్యత్తు తరం లకు చెందిన ప్రజల ప్రయోజనం కోసం అందుబాటు లో ఉండేటట్లుగా చూడాలన్న కమిశన్ యొక్క నిబద్ధత ను తెలియజేస్తున్నది.

# కొడాలి నాని నామినేషన్‌పై వివాదం

## –గుడివాడలోటెన్షన్ టెన్షన్

అమరావతి, ఏప్రిల్ 26: కృష్ణాజిల్లా గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొడాలి నాని నామినేషన్‌పై వివాదం ఏర్పడింది. నామినేషన్ లో తప్పుడు సమాచారం చేర్చారంటూ ఉరిటర్నింగ్ అధికారి (ఆర్వో) పెండ్యాల పద్మావతికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని అద్దెకిచ్చినట్లు అధికారులు పేర్కొన్న పత్రాలను దీనికి జత చేశారు. దీంతో తప్పుడు సమాచారమిచ్చిన కొడాలి నాని నామినేషన్‌ను తిరస్కరించాలని కోరారు. ఏ ప్రభుత్వ కార్యాలయాన్నీ వినియోగించలేదని కొడాలి నాని తన అఫిడవిట్‌లో పేర్కొన్న నేపథ్యంలో ఆధారాలతో టీడీపీ ఫిర్యాదు చేసింది.

రిటర్నింగ్ అధికారి వైసీపీకి తొత్తులా వ్యవహరిస్తున్నారని దీనిపై ఎన్నికల కమిషన్ కు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంతేకాక ఎమ్మెల్యే కొడాలి నానిపై ఐదు పోలీసు కేసులు ఉన్నా దానికి సంబంధించి కూడా తప్పుడు సమాచారం అందించారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల అఫిడవిట్?లో ఏదైనా ప్రభుత్వ కార్యాలయాన్ని వాడుకున్నారా లేదా అనే ఆప్షన్ లో ఎస్ అంటే రెంటు ఎవరు కట్టారు..? తదితర వివరాలను పొందుపర్చాలి. కానీ అందులో నో అని నమోదు చేశారు.

కానీ గతంలో సదరు ప్రభుత్వ భవనాన్ని మంత్రి కార్యాలయంగా వాడినందున దానికి సంబంధించిన అద్దె బకాయిలను సివిల్ సప్లై శాఖ ద్వారా చెల్లింపులు జరిపినట్టు మున్సిపల్ కమిషనర్ రాతపూర్వకంగా ఇచ్చిన కాపీని టీడీపీ నేతలు తమ ఫిర్యాదుతో జతపరిచారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నా.. ఈరోజు నామినేషన్ల వెరిఫికేషన్ కారణంగా ఇటువంటి అభ్యంతరకరమైన నామినేషన్లను తిరస్కరించే అవకాశం ఉన్నందున ఆర్వో తీసుకునే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు టీడీపీ నేతలు వాదిస్తున్నారు. ఇక్కడ న్యాయం జరగని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగాఈ విషయంపై రిటర్నింగ్ అధికారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ప్రజలను మభ్య పెట్టేందుకే రాజీనామాల చీకటి నాటకం- రఘునందన్ రావు



మెదక్, ఏప్రిల్ 26: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం రోడ్డు షో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రఘునందన్ రావును మండల బీజేపీ నాయకులు డోలు చప్పులు కోలాట ఆటపాటల మధ్య మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ? కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే అన్నారు. రేవంత్ రెడ్డి, హరీష్ రావు లు లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్నందున నేను రాజీనామా చేయాల్నా నువ్వు రాజీనామా చేయాలనే దొంగ నాటకానికి తెర లేపుతున్నట్టుందన్నారు. తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకు చీకట్లో రాజీనామా అనే కొత్త నాటకానికి వెలుగులోకి తీసుకొస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలను మర్చిపోయాం న్నారు. మహిళలకు నాలుగు వేల పెన్షన్ అందిస్తామని చెప్పి ఉచిత బస్సు ప్రయాణం పేరిట అక్కాచెల్లెళ్లకు కయ్యం పెట్టారన్నారు. ఆగస్టు 15న రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామనడం సిగ్గుచేటని, రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జనవరి లోనే రుణమాఫీ చేయొచ్చు కదా ఆగస్టు 15 ఎందుకు డెడ్ లైన్ విధించారని ప్రశ్నించారు. ఈ రుణమాఫీ కోసం ఏడుపాయల దుర్గామాత మీద ప్రమాణం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలపై దృష్టి సారించాలన్నారు. 10సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు రుణమాఫీ గురించి ఎందుకు ఆలోచించలేదన్నారు. రుణమాఫీ కోసం రాజీనామా చేస్తా అనడం దారుణమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హరీష్ రావులు తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకే ఈ కొత్త నాటకం ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను బొంద పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

భారతదేశాన్ని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దాలంటే కేవలం నరేంద్ర మోడీతోనే సాధ్యమని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీ బలపరిచిన అభ్యర్థి రఘునందన్ రావుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల వారు మెంబర్లతోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను బీజేపీ పార్టీలోకి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు, శ్రీనివాస్, తీగల శ్రీనివాస్ గౌడ్, శంకర్ గౌడ్, రాజిరెడ్డి, నరేష్ మహంకాళి, బీజేవైఎం ప్రశాంత్ గౌడ్, ఆకుల రమేష్, శంకర్, నవీన్, నీలం తిరుపతి, సంజీవులు, జాల పోచయ్య, జిపి స్వామి, గెరిగంటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ వద్ద ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

## –ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

రంగారెడ్డి ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నందిగామ వద్ద ఫార్మా కంపెనీలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. నందిగామ వద్ద ఆల్విన్ ఫార్మా పరిశ్రమలో మంటలు చెలరేగాయి. కొందరు కార్మికులు కిటీకీల్లోంచి బయటకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పలువురు కార్మికులు పరిశ్రమ లోపలే చిక్కుకున్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో పరిశ్రమలో 50 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. స్థానికులు సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది కాపాడింది. నిచ్చెనలతో కార్మికులను కిందకు తీసుకొచ్చారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




# కూకట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న నగదు పట్టివేత

హైదరాబాద్, ఏప్రిల్ 26: ఎన్నికలో కోడ నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నారు. పెద్ద మొత్తంలో నగదును సీజ చేస్తున్నారు. తాజాగా కూకట్‌పల్లిలో వాహనాల తనిఖీలు చేపట్టి పెద్ద మొత్తంలో నగదు సీజ్ చేశారు. ఏటీఎంలో నగదు నింపే వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ. 25.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్యూర్ కోడ్, అనుమతులు లేకుండా నగదు తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు రైటర్ ప్రీవియస్ క్యాష్ లాజిస్టిక్స్ ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# ప్రపంచ శక్తి సమ్మేళనంలో భాగం అయిన మంత్రుల స్థాయి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో శక్తి సంబంధిభద్రత



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: నెదర్లాండ్స్ లోని రాటర్ డేమ్ లో జరుగుతున్న వరల్డ్ ఎనర్జీ కాంగ్రెస్ యొక్క ఇరవై ఆరో సంచిక లో భాగం గా 2024 ఏప్రిల్ 24 వ తేదీ నాడు మంత్రుల స్థాయి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ను నిర్వహించడమైంది. ఈ సమావేశం లో దుబయి లో జరిగిన సిఒపి28 యుఎన్ క్లయిమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ద్వారా అత్యంత ప్రభావం పడే సందర్భాల పైన చర్చించారు. మంత్రుల స్థాయి సమావేశం లో శక్తి సంబంధ రంగం లో నూతన ఆవిష్కరణలు, సహకారం లతో పాటు విభిన్నమైన రూపుల ను సంతరించుకొంటున్న శక్తి సంబంధి అవసరాల లో రాబోయే సమస్యల ను పరిష్కరించడం ఎలాగన్న అంశాల ను కూడా చర్చించారు. ప్రపంచ శక్తి రంగ సమ్మేళనం (వరల్డ్ ఎనర్జీ కాంగ్రెస్) లో మూడవ రోజు న జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో నెదర్లాండ్స్ ఉప ప్రధాని మరియు జలవాయు, ఇంకా శక్తి విధానం శాఖ మంత్రి శ్రీ రాబ్ జెట్ టెన్ పాలుపంచుకొన్నారు.

ఈ కార్యక్రమం లో భారత ప్రభుత్వం లోని విద్యుత్తు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ పంకజ్ అగ్రవాల్ తో పాటు వివిధ దేశాల మరియు సంస్థ ల సీనియర్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

సమావేశం సాగిన క్రమం లో, కేంద్ర విద్యుత్తు శాఖ కార్యదర్శి తన ప్రసంగం లో ప్రపంచ శక్తి సంబంధి పరివర్తన లో విధానపరమైన ఉత్ప్రేరకం యొక్క ప్రాముఖ్యాన్ని గురించి నొక్కి పలుకుతూ సిఒపి28 లో భారతదేశం పోషించినటువంటి కీలకమైన పాత్ర ను గురించి ప్రముఖం గా పేర్కొన్నారు. ప్రపంచం క్రొత్త శక్తి వినియోగం దిశ లో పయనించేందుకు విధాన పరమైన ఉత్ప్రేరకం గా సిఒపి28 కి ఉన్న ప్రాముఖ్యాన్ని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం లో శక్తి దక్షత సంస్కరణ తాలూకు ప్రపంచ రేటు ను రెట్టింపు చేసుకోవడం మరియు 2030 వ సంవత్సరాని కల్లా ప్రపంచ నవీకరణ యోగ్య శక్తి సామర్థ్యాన్ని మూడు రెట్లు మేర పెంపొందింప చేసుకోవాలన్న సిఒపి28 నవీకరణ యోగ్య శక్తి మరియు శక్తి దక్షత వాగ్దానాల దిశ లో కార్యాల ను చేపట్టడం జి-20 న్యూ ఢిల్లీ లీడర్స్ డిక్లరేశన్ భారతదేశం యొక్క ప్రయాసల తాలూకు ఒక ప్రమాణం గా ఉంది అని ఆయన అన్నారు. సిఒపి27 మరియు జి20 వేదికల లో ప్రపంచ సర్వసమ్మతి దిశ లో ముందుకు పోతూ దీర్ఘకాలిక జీవన శైలి ని సమర్థించడం కోసం భారతదేశం ప్రతిపాదించినటువంటి మిశన్ లైఫ్ ను ప్రశంసించడమైందన్నారు. కార్బన్ కేప్చర్, యూటిలైజేశన్ ఎండ్ స్టోరేజ్ (సిసియుఎస్) మరియు గ్రీన్ హైడ్రోజన్ లకు పెద్ద పీట ను వేయడం తో పాటు గా కర్బన తటస్థత దిశ లో పరివర్తన ను తీసుకు రావడానికి సిఒపి28 ఇచ్చిన ప్రాధాన్యాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

శక్తి వినియోగం అంశం లో ఇంతవరకు అనుసరిస్తున్న పద్ధతుల నుండి సరిక్రొత్త మార్గాల కు మళ్ళే ప్రక్రియలోని సంక్లిష్టత ను గురించి విద్యుత్తు శాఖ కార్యదర్శి వివరిస్తూ, ఈ ప్రక్రియ లో అన్ని వర్గాల ను కలుపుకొంటూ, ముందుకు పోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రీవేంప్ డ్ ఇండియా ఎనర్జీ సెక్యూరిటీ సినారియోస్ (ఐఇఎస్ఎస్) 2024 డాశ్ బోర్డ్ (ప్రబిబిజూబ:// తివబబ2047.ఐనీల.తిని/) వంటి సాధనాల తో పాటు సాంకేతికత మోహరింపు మరియు సహకారాల భూమిక ను కూడా ఆయన ప్రస్తావించారు. ఇవి నరి అయినటువంటి నిర్ణయాల ను తీసుకోవడం లో తోడ్పడుతాయన్నారు. పి ఎమ్-కెయుఎస్ యుఎమ్ (ఖఓ-ఐజూఒఓ) స్కీము మరియు ఇళ్ళ పైకప్పుల మీద సౌర శక్తి ఆధారిత విద్యుత్తు ఉత్పాదన కార్యక్రమం ల వంటి కార్యక్రమాలు పర్యావరణపరమైన స్థిరత్వాని కి, ఇంకా ఉద్యోగాల కల్పన కు ప్రోత్సాహాన్ని ఇవ్వడం తో పాటు శక్తి సంబంధి భద్రత , ప్రాప్తి మరియు శక్తి సంబంధి సుస్థిరత లను సమతౌల్య పరచడం లో మహత్వపూర్ణమైన భూమిక ను నిర్వర్తిస్తున్నాయన్నారు. ఇండియన్ కార్బన్ మార్కెట్ స్థిరత్వ ప్రయాసల ను మరింత గా ముందుకు తీసుకు పోతుంది అని ఆయన అన్నారు.

సమావేశం లో పాలుపంచుకొన్న వారి ని ఉద్దేశించి కార్యదర్శి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలు శక్తి సంబంధి సంకటాన్ని ప్రభావశీలమైన రీతి న ఎదుర్కోవడం కోసం ఆర్థిక పోషణ మరియు స్వచ్ఛమైనటువంటి సాంకేతికత ల ప్రాప్తి వంటి విషయాల లో సహాయాన్ని అందించడం అవసరం అని పేర్కొన్నారు.

ఇరవై ఆరో వరల్డ్ ఎనర్జీ కాంగ్రెస్ సంపూర్ణ ప్రపంచం లో స్వచ్ఛమైనటువంటి మరియు అన్ని వర్గాల ను కలుపుకొని పోయేటటువంటి శక్తి సంబంధి పరివర్తన ల విషయం లో నాయకత్వాన్ని సమకూర్చడం లో ఒక ముఖ్యమైన మలుపు ను ఆవిష్కరించగలదన్న ఆశ ఉంది. 'ప్రజల కోసం మరియు పుడమి కోసం శక్తి వినియోగ పద్ధతి కి సరిక్రొత్త రూపు రేఖ లను అందించడం' అనే ఇతివృత్తం తో నాలుగు రోజుల పాటు ఈ సమావేశాలు ప్రపంచ శక్తి రంగం లో వరల్డ్ ఎనర్జీ కౌన్సిల్ చేస్తూ వస్తున్న కృషి కి వంద సంవత్సరాలు అయినందుకు ప్రతీక గా ఉన్నది. కౌన్సిల్ అభిప్రాయం లో, ఈ సమ్మేళనం ప్రపంచం లో శక్తి వినియోగం సంబంధి పరివర్తన ను ఆవిష్కరించే ప్రయత్నం లో ఒకదానితో మరొకటి పరస్పరం జత పడినటువంటి శక్తి సమాజాల యొక్క పాత్ర ఏమిటి అనేది కనుగొనడం కోసం నడుం బిగిస్తున్నది. ఆ సమాజాల సరళి ని ముందస్తు గా అంచనా కట్టడం కొంచెం కఠినమే అని చెప్పాలి. అవి ఎక్కువ అశాంతి తోను మరియు శరవేగం గా మార్పునకు లోనయ్యేవి గాను ఉన్నాయి.

వరల్డ్ ఎనర్జీ కౌన్సిల్ ఇండియా ను గురించి

వరల్డ్ ఎనర్జీ కౌన్సిల్ ఇండియా అనేది వరల్డ్ ఎనర్జీ కౌన్సిల్ లో (డబ్ల్యుఇసి) లో ఒక సభ్యత్వ దేశం గా ఉంది, 1923 వ సంవత్సరం లో వరల్డ్ ఎనర్జీ కౌన్సిల్ ను స్థాపించడమైంది. అంతరాయాల కు తావు ఉండని విధం గా శక్తి యొక్క సరఫరా ను మరియు వినియోగాన్ని ప్రోత్సహించాలి అనేది దీని లక్ష్యం గా ఉంది. డబ్ల్యుఇసి ఇండియా 1924 వ సంవత్సరం లో వరల్డ్ ఎనర్జీ కౌన్సిల్ లో మునుముందుగా చేరినటువంటి సభ్యత్వ దేశాల లో ఒకటి గా ఉంది. డబ్ల్యుఇసి ఇండియా భారత ప్రభుత్వం యొక్క విద్యుత్తు మంత్రిత్వ శాఖ సంరక్షణ లో బొగ్గు మంత్రిత్వ శాఖ, నూతన ఒ నవీకరణ యోగ్య శక్తి మంత్రిత్వ శాఖ, పెట్రోలియమ్ ఒ సహజ వాయువుల మంత్రిత్వ శాఖ లతో పాటుగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ల సహకారం తో పనిచేస్తున్నది.

వరల్డ్ ఎనర్జీ కాంగ్రెస్ 2024 లో పాలుపంచుకొన్న భారతదేశం: ఇండియా పెవిలియన్ ను ప్రారంభించిన విద్యుత్తు శాఖ కార్యదర్శి మరియు నెదర్లాండ్స్ లో భారతదేశం యొక్క రాయబారి

## పెండింగ్‌లో పెందుర్తి వైసిపి అభ్యర్థి అదీప్ రాజ్ నామినేషన్

అమరావతి, ఏప్రిల్ 26: ఏపీలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ నిన్నటితో ముగియగా, నేడు నామినేషన్ల పరిశీలన చేపట్టారు. కాగా, అనకాపల్లి జిల్లా పెందుర్తి వైసీపీ అభ్యర్థి అదీప్ రాజ్ కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నామినేషన్ ను ఎన్నికల రిటర్నింగ్ అధికారిలో పెండింగ్ లో ఉంచారు. ఎన్నికల అఫిడవిట్ లో కేసుల వివరాలను పొందుపరచలేదన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 29 లోపు వివరణ ఇవ్వాలంటూ అదీప్ రాజ్ కు ఆర్వో సమయం ఇచ్చారు. పెందుర్తి అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్ రాజ్ పోటీ చేస్తుండగా, కూటమి తరపున జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్ బరిలో దిగారు.

## ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం.. మంటల్లో చిక్కుకున్న 50 మంది కార్మికులు

హైదరాబాద్, ఏప్రిల్ 26: నందిగామలో శుక్రవారం భారీ అగ్నీ ప్రమాచం చోటుచేసుకుంది. నందిగామలోని ఆల్విన్ ఫార్మా కంపెనీలో ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. ఈ ఘటన జరిగిన సమయంలో మొత్తం 50 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో కొందరు కార్మికులు కిటికీల్లోంచి బయటకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

కార్మికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# బడుగు బలహీన వర్గాల అభివృద్ధే నా లక్ష్యం

-నా ఊపిరి ఉన్నంతవరకు నా జాతి కోసం కొట్లాడుతా

- పెద్దపల్లి ఇండిపెండెంట్ ఎంపీ అభ్యర్థి మేకల తిరుమల మాదిగ నామినేషన్



పెద్దపల్లి ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్): భవిష్యత్తు తరాల భావిభారత పౌరులకు బాగుకోసం నేను మొదటి అడుగు వేస్తున్నానని... పెద్దపల్లి ఇండిపెండెంట్ ఎంపీ అభ్యర్థి మేకల తిరుమల మాదిగ అన్నారు. గురువారం పెద్ద పెల్లి బస్టాండ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పెద్దపల్లి ఇండిపెండెంట్ ఎంపీ అభ్యర్థి మేకల తిరుమల మాదిగ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ నేను పయనం చేస్తానని పేర్కొన్నారు. తన ఊపిరి ఉన్నంతవరకు మాదిగ జాతి గౌరవాన్ని కాపాడేందుకే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్లో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు గెలుపొందిన ఏ నాయకుడు కూడా పెద్దపల్లి పార్లమెంటుపై దృష్టి సారించలేదన్నారు. గత 40 ఏళ్లుగా ఇక్కడ సంపాదించుకొని గొప్పవారు అయ్యారే తప్పితే ఇక్కడి ప్రజల కోసం ఏమి చేసింది లేదని ఆమె అన్నారు. నిన్న మొన్నటిదాకా పెద్దపల్లి పార్లమెంట్లో ఎంపీగా ఎవరు ఉన్నారో కూడా జనాలకు తెలియకుండా పోయిందంటే దీనికంటే ఆశ్చర్యం లేదని అన్నారు. అంతేకాకుండా వలసవాదులే ఎక్కువగా ఇక్కడ ఎంపీగా ఉండడం పరిపాటిగా మారిందని దానిని స్థానికులమే అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. పార్టీల కోసం జెండాలు మోస్తాం వారి గెలుపు కోసం అన్ని భరిస్తాం కానీ గెలిచాక మనల్ని మర్చిపోతారు. ఇదే పెద్ద పెల్లి పార్లమెంటు పరిధిలో జరుగుతుందని తెలిపారు. గెలుపొందిన నాయకులు వ్యాపారాల పేరుతో పట్నంలో బాగా వేస్తారే తప్పితే ఏ ఒక్కరికి సాయం చేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఇప్పుడున్న ప్రధాన పార్టీ నాయకుల్లో అందరూ పదవులు అనుభవించిన వారే కానీ ఏ ఒక్క ఊరుకు ఏం చేశారు గుండె మీద చెయ్యేసుకుని చెప్పాల్సిన సమయం వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల వచ్చినప్పుడు వచ్చి నేను ఈ పార్టీలో ఉన్న... నేను ఆ పార్టీలో ఉన్న... అని చెప్పుకుంటున్నారు. తప్పితే రేపే పార్టీలో ఉంటారో చెప్పే నాయకుడు కరువయ్యారు అని అన్నారు. నేను ఇక్కడి ప్రజల భవిష్యత్తు కోసం ఆలోచించ అందుకే పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిరుస్తున్న. ప్రజల పూర్తి మద్దతు నాకు ఉంటుందని ఆశిస్తున్నా ఆలోచించండి నాకు మద్దతుగా నిలబడి అని మేకల తిరుమల మాదిగ కోరారు.

# పుణెలో సాయుధబలగాల వైద్య కళాశాలలో జరిగిన 58వ బేచ్ యొక్క పాసింగ్ అవుట్ పరేడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పుణె లోని సాయుధ బలగాల వైద్య కళాశాల కు చెందిన 58 వ బేచ్ లోని 112 మంది వైద్య పట్టభద్రుల ను 2024 ఏప్రిల్ 25 వ తేదీ నాడు ఎఎఫ్ఎమ్‌సి లోని కెప్టెన్ దేవాశీశ్ శర్మ, కీర్తి చక్ర పరేడ్ గ్రౌండు లో జరిగిన ఒక విశేష కార్యక్రమం లో భారతీయ సాయుధ బలగాల లోకి చేర్చుకోవడమైంది.

ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథి గా డైరెక్టర్ జనరల్ ఆర్మ్ డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ (డిజిఎఎఫ్ఎమ్ఎస్) మరియు ఆర్మీ మెడికల్ కోర్ కు చెందిన సీనియర్ కర్నల్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ శ్రీ దళ్ జీత్ సింహ్ విచ్చేశారు. ఆయన కమిశనింగ్ పరేడ్ ను పరిశీలించారు. ఈ పరేడ్ కు మెడికల్ కేడెట్ (ప్రస్తుతం లెఫ్టినెంట్) శ్రీ సుశీల్ కుమార్ సింహ్ సారథ్యం వహించారు.

క్రొత్త గా విధుల లోకి చేర్చుకొన్న అధికారుల కు డిజిఎఎఫ్ఎమ్ఎస్ అభినందనల ను తెలియజేస్తూ, వారు అత్యున్నత సమర్పణ భావం తో దేశాని కి మరియు సాయుధ బలగాల కు సేవ చేయవలసిందంటూ ఉద్బోధించారు. వారికి ప్రకాశవంతమైనటువంటి మరియు సమృద్ధం అయినటువంటి భవిష్యత్తు లభించాలంటూ ఆయన ఆకాంక్షించారు.

ఎఎఫ్ఎమ్‌సి లో 58 వ బ్యాచ్ కు చెందిన సైనిక విద్యార్థులు 2023 శీతకాల ఎమ్‌యుహెచ్ఎస్ పరీక్షల లో అద్భుతం గా రాణించారు. పొరుగున ఉన్న మిత్ర దేశాల కు చెందిన అయిదుగురు కేడెట్స్ సహా మొత్తం 147 మంది సైనిక విద్యార్థులు పట్టభద్రులు గా నిలచారు. సాయుధ బలగాల వైద్య సేవల లో ప్రవేశించిన 112 మంది కేడెట్స్ లో 87 మంది పురుష సైనిక విద్యార్థులు మరియు 25 మంది మహిళా సైనిక విద్యార్థులు ఉన్నారు. 88 మంది ని సైన్యం లో చేర్చుకోగా, పది మందిని నౌకా దళం లో, మరి పద్నాలుగు మంది ని వాయు సేన లోకి చేర్చుకొన్నారు.

త్రివిధ దళాల లోకి సైనిక విద్యార్థుల ను చేర్చుకొన్న కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం, మార్గదర్శక ప్రాయమైనటువంటి విద్యా సంబంధమైన ఘనతల ను సాధించినందుకు గాను కేడెట్ లకు ఎకడెమిక్ అవార్డుల ను అందించే కార్యక్రమం జరిగింది. ఈ కళాశాల లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు 'రాష్ట్రపతి బంగారు పతకం', ఇంకా 'కళింగ ట్రాఫీ'. ఈ సంవత్సరం లో 'రాష్ట్రపతి బంగారు పతకాన్ని' ఫ్లయింగ్ ఆఫీసర్ శ్రీ ఆయుష్ జయ్‌స్వాల్ కు మరియు 'కళింగ ట్రాఫీ' ని సర్జన్ సబ్ లెఫ్టినెంట్ బాణి కౌర్ గారి కి ప్రదానం చేయడమైంది.

దేశం లో కెల్లా అయిదు అగ్రగామి వైద్య కళాశాల లో స్థానాన్ని సంపాదించుకోవడం తో పాటు నాణ్యమైన వైద్య విద్య ను, ఆరోగ్య సంరక్షణ సేవల ను అందించేందుకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ను తెచ్చుకొన్న ఎఎఫ్ఎమ్‌సి కి దేశ ప్రజల కు 75 సంవత్సరాల పాటు గొప్ప సేవ ను చేసినందుకు గాను 'ప్రెసిడెంట్స్ కలర్' పురస్కారాన్ని భారతదేశం యొక్క రాష్ట్రపతి మాన్యురాలు శ్రీమతి ద్రౌపది ముర్ము 2023 డిసెంబరు 1 వ తేదీ న ప్రదానం చేశారు. ఈ కళాశాల కు 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ యూనిట్ సైటేశన్' ను కూడా 2024 మార్చి నెల 18 వ తేదీ నాడు జనరల్ శ్రీ అనిల్ చవ్హాణ్, పివిఎస్ఎమ్, యువైఎస్ఎమ్, ఎవిఎస్ఎమ్, ఎస్ఎమ్, ఇంకా విఎస్ఎమ్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) ప్రదానం చేశారు.

సర్వీసు లో ఉన్న ఉన్నతాధికారులు, పూర్వ అధికారులు, అధ్యాపక అధికారులతో పాటు వైద్యం మరియు నర్సింగ్ విభాగాల కు చెందిన కేడెట్ లు, సైన్యం లో చేర్చుకొన్న కేడెట్ ల యొక్క తల్లితండ్రులు మరియు కేడెట్ ల యొక్క కుటుంబ సభ్యులు కూడా ను ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్న వారి లో ఉన్నారు.

ఈ విశేషమైన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని లెఫ్టినెంట్ జనరల్ శ్రీ నరేంద్ర కోట్ వాల్, ఎవిఎస్ఎమ్, ఎస్ఎమ్, విఎస్ఎమ్ డైరెక్టరు ఒ కమాండెంట్ తో పాటు మేజర్ జనరల్ శ్రీ గిరిరాజ్ సింహ్ డీన్ మరియు డిప్యూటీ కమాండెంట్ ఎఎఫ్ఎమ్‌సి ల ఆధ్వరం లో నిర్వహించడమైంది.

# దేశంలో తొలి బహుళార్థ సాధక గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా ప్రారంభించిన ఎస్ జేవీఎన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: దేశంలో తొలి బహుళార్థ సాధక గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టు ను ఎస్ జేవీఎన్ లిమిటెడ్ విజయవంతంగా ప్రారంభించింది. హిమాచల్ ప్రదేశ్ లోని జాక్రిలో ఎస్ జెవిఎన్ లిమిటెడ్ భారతదేశంలో తొలిసారిగా నెలకొల్పిన బహుళ ప్రయోజన (కంబైన్డ్ హీట్ , పవర్) 1,500 మెగావాట్ల నత్ప జాక్రి హైడ్రో పవర్ స్టేషన్ (ఎన్ జెహెచ్ పిఎస్) లో ఉత్పత్తి ప్రారంభమైంది. దేశంలో తొలిసారిగా ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టును ప్రారంభించడం ద్వారా ఎస్ జెవిఎన్ లిమిటెడ్ ఒక ముఖ్యమైన మైలురాయి సాధించింది. ఈ ప్రాజెక్టు లో ఉత్పత్తి అయ్యే గ్రీన్ హైడ్రోజన్ ను ఎస్ జెవిఎన్ నెలకొల్పిన హై వెలాసిటీ ఆక్సిజన్ ఫ్యూయల్ (ఊఙాఈ) కోటింగ్ ఫెసిలిటీ ఇంధన అవసరాల కోసం ఉపయోగిస్తారు. ఉపయోగించబడుతుంది. అంతేకాకుండా 25 కిలోవాట్ల సామర్థ్యం గల ఫ్యూయెల్ సెల్ ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతుంది.

దేశంలో మొట్టమొదటి బహుళ ప్రయోజన (కంబైన్డ్ హీట్ , పవర్) గ్రీన్ హైడ్రోజన్ జనరేషన్ ప్లాంట్ ను ఎస్ జేవీఎన్ చైర్ పర్సన్ , మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి గీతా కపూర్ ఏప్రిల్ 24న ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడిన శ్రీమతి గీతా కపూర్ "భారత ప్రభుత్వ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా ఎస్ జేవీఎన్ గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు అయ్యింది. దీంతో విద్యుత్ రంగంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం అవుతుంది. దీనివల్ల పరిశుద్ధ ఇంధన ఉత్పత్తిలో గ్రీన్ హైడ్రోజన్ కీలక పాత్ర పోషిస్తుంది." అని పేర్కొన్నారు.

అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్ట్ 8 గంటల సమయంలో ప్రతిరోజూ 14 కిలోగ్రాముల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఉత్పత్తి అయిన హైడ్రోజన్ ను మొత్తం 12 ఎ3 నిల్వ సామర్థ్యం గల ఆరు నిల్వ ట్యాంకులలో 30 బార్ల ఒత్తిడితో నిల్వ చేస్తారు. ఈ ప్రాజెక్ట్ 20 ఔఎ3/ గంట సామర్థ్యం గల ఆల్కలీన్ ఎలక్ట్రోలైజర్ ని ఉపయోగించి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తుంది, దీనికి అవసరమైన ఇంధనం సిమ్లాలోని వధాల్‌లో ఎస్ జెవిఎన్ నెలకో;ల్పిన 1.31 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం నుంచి పునరుత్పాదక శక్తిగా సరఫరా అవుతుంది.

గ్రీన్ హైడ్రోజన్ ను ఇంధన ఉత్పత్తి తో పాటు టర్బైన్ నీటి అడుగున భాగాన ఏర్పాటైన హై వెలాసిటీ ఆక్సిజన్ ఫ్యూయల్ (ఊఙాఈ) కోటింగ్ ఫెసిలిటీ ఇంధన అవసరాల కోసం ఉపయోగిస్తారు

రామ్‌పూర్‌లోని యూనిట్-2 రిమోట్‌గా ఆపరేట్ చేయడం ద్వారా 1,500 మెగావాట్ల నాత్‌పా ఝక్రి హైడ్రో పవర్ స్టేషన్ ( ఎన్ జెహెచ్ పిఎస్ ),412 మెగావాట్ల రాంపూర్ హైడ్రో పవర్ స్టేషన్ (రాంపూర్ హెచ్ పిఎస్ ) కేంద్రీకృత కార్యకలాపాలను కూడా నంస్థ చైర్ పర్సన్ ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని జాక్రి వద్ద ఉన్న న్ జెహెచ్ పిఎస్ కంట్రోల్ రూమ్ నుండి హెచ్ పిఎస్ . రాంపూర్ హెచ్ పిఎస్ విజయవంతంగా ఎన్ జెహెచ్ పిఎస్ తో టాండమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నిర్వహించబడుతోంది.

ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేసిన ఎన్ జెహెచ్ పిఎస్ , రాంపూర్ హెచ్ పిఎస్, ఎస్ జేవీఎన్ కార్పొరేట్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఎలక్ట్రికల్ డిజైన్ బృందాన్ని శ్రీమతి కపూర్ అభినందించారు. మొత్తం రాంపూర్ హెచ్‌పిఎస్‌ను ఎన్‌జెహెచ్‌పిఎస్ నుంచి నిర్వహించడానికి అవసరమైన సౌకర్యాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆమె కోరారు.

కార్యక్రమంలో ప్రాజెక్ట్ హెడ్ ( న్ జెహెచ్ పిఎస్ ), శ్రీ మనోజ్ కుమార్; ప్రాజెక్ట్ హెడ్ (రాంపూర్ హెచ్ పిఎస్ ), శ్రీ వికాస్ మార్యా; విభాగాధిపతి (ఎలక్ట్రికల్ డిజైన్), శ్రీ హరీష్ కుమార్ శర్మ; ఎన్ జెహెచ్ పిఎస్ రాంపూర్ హెచ్ పిఎస్, కార్పొరేట్ ప్రధాన కార్యాలయాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# స్క్రూటినీలో 10మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ..




నిజామాబాద్, ఏప్రిల్ 26: లోక్ సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గ స్థానానికి దాఖలైన నామినేషన్లను కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ శుక్రవారం స్క్రూటినీ జరిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో అభ్యర్థులు, వారి ప్రతినిధుల ముందర రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు నేతృత్వంలో నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా 10మంది అభ్యర్థులు సమర్పించిన అన్ని సెట్ల నామినేషన్లు వివిధ కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యాయని కలెక్టర్ వివరించారు.

నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గ స్థానానికి 42మంది అభ్యర్థులు 90నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూటినీలో 10మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించబడ్డాయని తెలిపారు. 32 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయన్నారు. అఫిడవిట్ సమర్పించకపోవడం, సక్రమంగా లేకపోవడం, నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయకపోవడం, ప్రతిపాదకుల వివరాలు పొందుపర్చక పోవడం వంటి కారణాల వల్ల పది నామినేషన్లు తిరస్కరించబడ్డాయన్నారు. ఈ మేరకు ఒక్కో అభ్యర్థి వారీగా నామినేషన్ పత్రాలను వారి సమక్షంలోనే పరిశీలిస్తూ, తిరస్కరణకు గురైన నామినేషన్లు ఎందుకు తిరస్కరించబడ్డాయనే వివరాలను స్వయంగా కలెక్టర్ అభ్యర్థులకు వెల్లడించారు.

నామినేషన్లు తిరస్కరణకు గురైన వాటిలో మిర్యాల్ కర్ జయప్రకాశ్, పోతు అశోక్, మొహమ్మద్ జమీల్, ఎం.డీ.షాహెద్ ఖాన్, కొండూరు గంగాధర్, పానిగంటి రజితావాణి, చెంచుల అశోక్, బేగరి పోశం, మిసాల శ్రీనివాస్ రావు, వి.మహాతేజ అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాలేదని కలెక్టర్ తెలిపారు. స్క్రూటినీ ప్రక్రియలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసి గుడ్ న్యూస్

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసి గుడ్ న్యూస్ చెప్పింది. వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం శ్రీశైల పుణ్యక్షేత్రానికి రాజధాని ఏసి బస్సులను ఆర్టీసి నడుపుతోంది. హైదరాబాద్ నుంచి ప్రతి గంటకో బస్సును భక్తులకు అందుబాటులో ఉంచింది. ఈ బస్సుల్లో జేబీఎస్ నుంచి రూ.524, బిహెచ్ఈఎల్ నుంచి రూ.564 టికెట్ ధరను నిర్ణయించింది. ఆధునిక హంగులతో ఘాట్ రోడ్డుకు తగ్గట్టుగా ఈ రాజధాని ఎసి బస్సులను ప్రత్యేకంగా సంస్థ తయారు చేయించింది.

# అమ్మవారి ఆలయ స్వర్ణ తాపాడానికి రూ.10 లక్షల విరాళం..



అమరావతి, ఏప్రిల్ 26: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ వారి ఆలయ స్వర్ణ తాపడం కోసం ఒక భక్తుడు భారీ విరాళాన్ని అందజేశారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో అమ్మవారి ఆలయానికి డొనేషన్లు ఇచ్చే దాతల కోసం ప్రత్యేకంగా డోనర్ సెల్ ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. డోనార్ సెల్ ప్రారంభమైన అనంతరం శ్రీ అమ్మవారి ఆలయం స్వర్ణ తాపడం పనుల కోసం విజయవాడకు చెందిన దాత కడియాల వంశీకృష్ణ, పద్మజలు రూ.10,00,00 0లు (అక్షరాలా పది లక్షల రూపాయలు) విరాళాన్ని ఆలయ ఈవో కె.ఎస్ రామరావు చేతుల మీదుగా దేవస్థానంకు అందజేయగా, ఆలయ అధికారులు వీరికి మంగళ వాయిద్యముల నడుమ స్వాగతం పలికి, కనక దుర్గమ్మ దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి, అమ్మవారి ప్రసాదములు, శేష వస్త్రం చిత్రపటం అందజేశారు.



# కాంగ్రెస్‌లో చేరిన బల్మూరు మండల బీఆర్ఎస్



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26: నాగర్ కర్నూల్ జిల్లాలోని బల్మూరు మండల బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొండానాగుల గ్రామ మాజీ సింగల్ విండో చైర్మన్ చంద్రమోహన్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ రామస్వామి గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ లాలు రెడ్డి, సింగల్ విండో మాజీ వైస్ చైర్మన్ బిచ్చన్న తదితరులు బీఆర్ఎస్ పార్టీ విధి విధానాలు నచ్చక ఆ పార్టీకి రాజీనామా చేసి నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి మల్లు రవి, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈకార్యక్రమంలో బల్మరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు మషాన్న, జిల్లా నాయకులు శ్రీపతి రావు, సుధాకర్ గౌడ్, చుక్క రెడ్డి, తిరుపతి రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లికంటి శ్రీనివాస్, మహమూద్, మహాదేవపూర్ ఎంపీటీసీ ఆంజనేయులు, లక్షమయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్లను చోరీచేసి.. సముద్ర మార్గంలో ఇతర దేశాలకు: సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26: హైదరాబాద్‌లో సెల్‌ఫోన్లు చోరీచేసి ఇతర దేశాలకు తరలిస్తున్న ముఠాను సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ముఠాకు చెందిన ఐదుగురు సూడాన్ దేశస్థులు సహా 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.75 కోట్ల విలువైన 7.03 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను హైదరబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిందితుల్లో 12 మంది హైదరాబాద్‌కు చెందినవారు, ఐదుగురు సూడాన్ వాసులు ఉన్నారని చెప్పారు.

చోరీకి గురైన, దెబ్బతిన్న సెల్‌ఫోన్లను అబిడ్స్‌లోని జగదీశ్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని తెలిపారు. దెబ్బతిన్న ఫోన్లను అక్కడే డిస్మెంట్ చేస్తున్నారని వెల్లడించారు. ఎలమంద రెడ్డి అనే వ్యక్తి జగదీశ్ మార్కెట్‌లో ఇలాంటి ఫోన్ల కోసం ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేశాడని పేర్కొన్నారు. ఐఫోన్లను కూడా రూ.8 వేల నుంచి అమ్ముతున్నారని చెప్పారు. సెల్‌ఫోన్లను సముద్ర మార్గం ద్వారా సూడాన్ తరలిస్తున్నారని తెలిపారు. విమానాశ్రయాల్లో నిఘా ఎక్కువగా ఉంటుందని, పడవల్లో వాటిని తీసుకెళ్తున్నారని వెల్లడించారు.

# ఇందూర్‌ను.. స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా.. చాయ్ పే చర్చలోఎంపీ అరవింద్..



నిజామాబాద్, ఏప్రిల్ 26: ఓటు వేద్దాం.. ఓటు వేయిద్దాం, ఓటు హక్కు అమూల్యమైనదని యువత తప్పకుండా ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేది యువకులేనని, ప్రజలకు సేవ చేసి మంచి పనులు చేసే నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత యువకులపై ఉందన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమానికి ఎంపీ ధర్మపురి అరవింద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈసందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ? కేవలం ఒక వర్గం కోసమే కాంగ్రెస్ మేనిఫెస్టో ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దేశంలోని రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి కృషి చేశారని తెలిపారు. నిజామాబాద్ నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. రామరాజ్య స్థాపనకు కమలానికే పట్టం కట్టండని కోరారు.

నిజామాబాద్ జిల్లాలో ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులను పరామర్శించిన ఎంపీ ధర్మపురి అరవింద్ ..

నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి బడా పహాడ్ కు వెళ్తుండగా మల్లారం అటవీ ప్రాంతంలో కొత్తపేట శివారులో వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులను ఎంపీ ధర్మపురి అరవింద్ పరామర్శించారు.

శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

# కారు ఢీ .. కార్పొరేషన్ ఉద్యోగి మృతి



వరంగల్, ఏప్రిల్ 26: వరంగల్ మహానగరపాలక సంస్థలో జవాన్ గా పనిచేస్తున్న కొమ్ము దేవయ్య శుక్రవారం తెల్లవారుజామున డ్యూటీలో ఉండగా ఒక గుర్తుతెలియనీ కారు వచ్చి డీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు

బల్దియాలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తూ ఉన్న జవాన్ కు ఒక కుమారుడు కూతురు ఉన్నారు .కాజీపేట ప్రాంతానికి చెంది జవాన్ కొమ్ము దేవయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, వారి స్థానంలో వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని ఔట్సోర్సింగ్ జేఏసీ అధ్యక్షులు పుల్లా రమేష్ కోరారు.

జవాన్ దేవయ్య మృతి చెందిన ఘటన తెలుసుకుని సిఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్ వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూనియన్ నాయకులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పరామర్శించారు.

# తిరుపతిలో టీటీడీ ఆసుపత్రులను పరిశీలించిన ఏపీ గవర్నర్



తిరుపతి, ఏప్రిల్ 26: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రులను రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం సందర్శించారు. ముందుగా బర్డ్ ఆసుపత్రిని సందర్శించి, నిరుపేదలకు ఉచితంగా మోకాలి కీళ్ల మార్పిడి , ఇతర ఎముకల సంబంధిత వ్యాధులకు అందుతున్న చికిత్స, ఐసీయూ, ఔట్‌పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, డిజిటల్ ఎక్స్‌రే, సిటి స్కాన్, కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రి వార్డుల్లో గుండె జబ్బులతో చికిత్స పొందు తున్న చిన్నారులను, క్యాథ్‌ల్యాబ్, ఐసీ యూ తదితర వార్డులను సందర్శించి, రోగుల తల్లిదండ్రులతో మాట్లాడారు. నిరుపేదలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి చిన్నారులకు టీటీడీ అందిస్తున్న సేవల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులను టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి రెడ్డప్ప రెడ్డి, పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, పాల్గొన్నారు.

# కాలుష్య రహిత ప్రచారం జరిగేలా దృష్టి సారించండి

**-ఎన్నికల సంఘానికి "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ "విజ్ఞప్తి**

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలుగు రాష్ట్రాల్లో నామినేషన్ల పర్వం ముగిసిన నేపథ్యంలో నాయకులు ప్రచారం పేరుతో పర్యావరణ విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని, గతంలో చెప్పిన విధంగా పర్యావరణ హిత ప్రచారం జరిగేలా పార్టీల కదలికలపై డేగ కళ్ళు సారించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ " ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ కు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య, కౌన్సిల్ జాతీయ సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు. నిన్నటివరకు జరిగిన నామినేషన్ ల సందర్భంగా అనేకమంది జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు వందల సంఖ్యలో మోటారు వాహనాలతో భారీ ర్యాలీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ ర్యాలీల కారణంగా వాహన కాలుష్యం భారీ స్థాయిలో పెరగడమే కాకుండా సామాన్య జనం అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. పర్యావరణ సమస్యలు సమాజాన్ని అతలాకుతలం చేస్తున్నా రాజకీయ పార్టీల నాయకులు ప్రకృతి విధ్వంసంలో ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదని ఆరోపించారు. రాజకీయనాయకుల తీరు సమాజాన్ని నాశనం చేసేలా ఉందని, మీ అధికారాలతో ఎన్నికల క్రతువులో జరుగుతున్న ఈ పర్యావరణ నష్టాన్ని నూరు శాతం నియంత్రించాలని వారు విజ్ఞప్తి చేశారు. మీరు (ఎన్నికల సంఘం) తీసుకునే నిర్ణయం స్ఫూర్తిదాయకంగా ఉండేలా ఈ ఎన్నికల ప్రచారంలో వాహన ర్యాలీని పూర్తిగా నిషేదించాలని వారు కోరారు. వ్యవస్థను కాపాడాల్సిన నేతలు తమ దాంబికం కోసం ప్రచార పర్వంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం, ఇంధన వినియోగం, ధ్వని కాలుష్యాన్ని పెంచేలా ఆర్కెస్ట్రా హోరు తదితర చర్యలను నిర్మొహమాటంగా ఆపాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు కేవలం కాల్బలంతోనే ఎన్నికల ప్రచారం నిర్వహించుకొనేలా పార్టీలను ఆదేశించి ప్రకృతి - పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

# చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి: ఆరెకపూడి గాంధీ



హైదరాబాద్, ఏప్రిల్ 26: రానున్న పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వం గెలుపునకు ప్రతి ఒక నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ళ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం విలేజ్, మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రాబోస్ నగర్ కాలనీలో పాదయాత్ర చేసి బీఆర్ఎస్ పార్టీ కరపత్రాలను ఇంటింటికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెవెళ్ళ గడ్డపై కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందిద్దామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తు వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తామన్న 6 గ్యారెంటీల్లో ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయలేదని, ప్రజలను ఉచిత హామీలతో మభ్యపెట్టే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# దుర్గా సప్తశతి చండీ హోమం గోడ పత్రిక ఆవిష్కరణ

**-గోడ పత్రికను ఆవిష్కరించిన డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు**



హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సనాతన హైందవ ధర్మనీ అందించిన యజ్ఞలు హోమాలు సకల జనుల శుభం కొరకే అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు.ప్రకృతి ఆరాధనలో , హోమాలు యాగాది క్రతువులు ప్రధానమైనవని ఆయన అన్నారు. ఏళ్ల తరబడి తపస్సులు చేసి సాధించి ,మహా ఋషులు మనకు అందించారని ఆయన పేర్కొన్నారు.

శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివ స్వామిజీ వారి మంగళ శాసనాలతో శ్రీ శైవ క్షేత్ర వనిత శక్తి అంతర్జాతీయ సంస్థ వారి ఆధ్వర్యంలో ఈ ఏడాది జూన్ 14న అష్టోత్తర హోమ గుండాత్మక చండీ హోమం నిర్వహించ తలపెట్టారు.

శుక్రవారం నాడు కొత్తపేటలోని శ్రీ శైవ క్షేత్ర పీఠం లోని ఇనీదుకు సంబంధించిన గోడపత్రికను ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ వకుళాభరణం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వనిత శక్తి నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హైమ, శ్రీ శైవ క్షేత్ర పీఠం మేనేజర్ వి.కోటేశ్వరరావు, ధర్మో రక్షితి రక్షితః ట్రస్ట్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎల్ వి.కుమార్, ఆనంద్ బాబు, నేషనల్ డైరెక్టర్ సత్యలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు నకిరేకంటి రేణుక, మధుసూదన్ గౌడ్, తదితరులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

# పే రివిజన్ కమిటీతో సమావేశం

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : తెలంగాణ గవర్నమెంట్ గజిటెడ్ నర్సెస్ అసోసియేషన్ వారితో రెండవ పే రివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్ గారి కమిటీ నేడు సమావేశం నిర్వహించడం జరిగిందని, తమ అసోసియేషన్ గతంలో సమర్పించిన ఖఖీఅ ప్రతిపాదనలపై కమిటీతో క్షుణ్ణముగా చర్చించడం జరిగిందని అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ హన్సిలి, లిల్లీ మేరి, అనిత గ్రేస్ తెలిపారు

# ఈవీఎంలపై మా పోరాటం ఆగదు : ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో మొత్తం వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం ముగిసిపోదని అఖిలేష్ వ్యాఖ్యానించారు. ఇది దీర్ఘకాలిక పోరాటమని ఆయన స్పష్టం చేశారు. ఈవీఎంలపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పును అందరూ అంగీకరించినా పోలింగ్ మెషీన్లకు వ్యతిరేకంగా జరిగే పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు.

వీవీప్యాట్, ఈవీఎంలపై ముమ్ముందు సుదీర్ఘ పోరాటం సాగుతుందని అన్నారు. ప్రపంచంలోని పలు దేశాలు ఈవీఎంలను విశ్వసించడం లేదని, వాటిని ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించడాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని అఖిలేష్ పేర్కొన్నారు. ఈవీఎంల వాడకాన్ని రాజ్యాంగ విరుద్ధమని జర్మనీ సహా పలు దేశాలు వ్యవహరిస్తున్నాయని గుర్తుచేశారు .జర్మనీ, నెదర్లాండ్స్, అమెరికా వంటి పలు అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంల వాడకాన్ని నిషేధించాయని చెప్పారు. విపక్ష ఇండియా కూటమి, ఎస్పీలకు పట్టం కడితే కేంద్రంలో ఏర్పాటయ్యే తమ ప్రభుత్వం ఈవీఎంల వాడకాన్ని నిలిపివేస్తుందని అఖిలేష్ హామీ ఇచ్చారు.

# భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

హైదరాబాద్, ఏప్రిల్ 26: తాగుడు విషయంలో భార్యతో జరిగిన గొడవతో మనస్థాపానికి గురయిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉంటున్న దేరంగుల చిరంజీవి(35)కి భార్య వసంతతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. గత కొంతకాలంగా చిరంజీవికి, భార్య వసంతకు మధ్యన తరచూ గొడవలు జరుగుతున్నాయి. రోజూ తాగివస్తున్న భర్తను మందలిస్తుండడంతో గొడవలు పెద్దవయ్యాయి.

ఈ క్రమంలో నాలుగురోజుల క్రితం పిల్లలను బాబాయి రంగస్వామి సొంతూరైన అనంతపురం తీసుకువెళ్లాడు. కాగా రాత్రి 8గంటలకు మరోసారి మద్యం సేవించి ఇంటికి వచ్చిన చిరంజీవితో భార్య వసంత గొడవకు దిగింది. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో వసంత ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయింది. రెండు గంటల తర్వాత ఇంటికి వచ్చి చూడగా భర్త చిరంజీవి చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు.

# సికింద్రాబాద్ ప్రజల ఇంటి మనిషి.. పజ్జన్న: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 26: ప్రజాసేవే పరమావధిగా భావించే పద్మారావు గౌడ్.. మాస్ లీడర్ అనే పదానికి నిర్వచనమని, సికింద్రాబాద్ ప్రజల ఇంటి మనిషని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖఖీ) అన్నారు. పజ్జన్న నాలుగు దశాబ్దాలుగా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. 2001 నుంచి ఉద్యమ నాయకుడు కేసీఆర్ వెంట నడుస్తూ హైదరాబాద్ మహానగరంలో గులాబీ జెండాని రెపరెపలాడిస్తున్నారని చెప్పారు.

కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా.. పద్మారావు గౌడ్ సికింద్రాబాద్ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో సేవలు అందించారని వెల్లడించారు. ఇప్పుడు సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మన ముందుకు వస్తున్నారని చెప్పారు. పార్లమెంటులో పద్మారావు గౌడ్ గళం.. సికింద్రాబాద్‌కు బలమంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ:జిల్లా ఎస్పీ



భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 26 (నేటినిజం ప్రతినిధి) : ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద గల చెక్‌పోస్ట్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేసిన ఎస్పీ ఓటర్లను ప్రభావితం చేసే విధంగా అక్రమంగా నగదు, మద్యం రవాణాను అరికట్టడానికి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించిన ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

# ఓయూలో ఓపెన్ డే.. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, ఏప్రిల్ 26: ఉస్మానియా యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు 'ఉస్మానియా తక్ష్ - 2024'లో భాగంగా వర్సిటీలోని అన్ని కళాశాలలు, విభాగాలలో ఓపెన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విభాగాలలో ప్రత్యేకంగా కొన్ని అంశాలలో పోటీలు నిర్వహించారు. మరికొన్ని విభాగాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆయా విభాగాలన్నింటినీ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను మరింత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. వర్సిటీ గత వైభవాన్ని ప్రస్తుత తరం విద్యార్థులకు చాటిచెప్పేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వర్సిటీ ప్రారంభించిన రోజును పురస్కరించుకుని వ్యవస్థాపక దినోత్సవాన్ని గత 104 ఏళ్లలో ఎప్పుడూ నిర్వహించలేదని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం నుంచి ప్రతి ఏడాది వర్సిటీని ప్రారంభించిన ఏప్రిల్ 26వ తేదీన ఘనంగా ఓయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# కంటోన్మెంట్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం: ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

హైదరాబాద్, ఏప్రిల్ 26: మాయమాటలు చెప్పి అమలు చేయలేని హామీలు ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటుతోనే తగిన గుణపాఠం చెప్పాలని, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు.

గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో వార్డు రసూల్‌పురలోని గన్‌బజార్‌లో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో ఇంటింటికీ చేపట్టిన పాదయాత్రలో పాల్గొని ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గడిచిన పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, సీనియర్ నాయకులు దేవలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమష్టిగా పనిచేద్దాం.. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగురవేద్దాం: పద్మారావుగౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 26: సమష్టిగా పనిచేసి సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగురవేద్దామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ?సామాన్య కార్యకర్త నుంచి తాను ఎదిగానని చెప్పారు.

బీజేపీ నుంచి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన నిధులన్నీ ల్యాప్స్ అయ్యాయన్నారు. జై శ్రీరాం, జై మోదీ అని చెప్పుకుంటూ కిషన్‌రెడ్డి ఓట్లు అడుగుతున్నారన్నారు. ఇక దానం నాగేందర్ బీఆర్ఎస్ బీఫాంతో గెలిచి వేరే పార్టీలోకి వెళ్లి రాజీనామా చేయకుండా ఎంపీగా పోటీ చేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఉన్న పదవి కూడా పోతుందన్నారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఈ నెల 27 నుంచి సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో పాదయాత్రలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, ప్రభాకర్‌రావు , స్థానిక కార్పొరేటర్లు మహేశ్వరి, కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# నోటాకే మెజారిటీ వస్తే ఎన్నికను రద్దు చేయాలి

## -ఎన్నికల కమిషన్ నుంచి సమాధానాన్ని కోరుతూ సుప్రీంకోర్టు నోటీసు

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ స్);సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కీకల పరిణామం ఒకటి చోటుచేసుకుంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల కన్నా నోటా(నన్ ఆఫ్ ది అబవ్)కు అధిక ఓట్లు వచ్చిన పక్షంలో ఆ స్థానం ఎన్నికను రద్దు చేసి తాజాగా ఎన్నికలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై ఎన్నికల కమిషన్ నుంచి సమాధానాన్ని కోరుతూ సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసు జారీచేసింది. రచయిత, హక్కుల కార్యకర్త, స్ఫూర్తిదాయక వక్త శివ్ ఖేరా ఈ పిల్ దాఖలు చేశారు. 2013 సుప్రీం కోర్టు తీర్పు మేరకు నోటా ఆప్షన్‌ను ఎన్నికలలో ఓటర్లకు ఎన్నికల కమిషన్ కల్పిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసేందుకు ప్రతికూల ఓటింగ్ అవకాశం ఓటరుకు కల్పించాల్సిన అవసరం ఉందని 2013 నాటి తన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. తమను గురించి ఓటర్లు ఏమనుకుంటున్నారో రాజకీయ పార్టీలకు, వాటి అభ్యర్థులకు తెలుస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇవిఎంలలో నోటా ఆప్షన్‌ను కల్పించాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

కాగా..తాజాగా శివ్ ఖేరా దాఖలు చేసిన పిల్‌పై సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇసికి నోటీసు జారీచేసింది. తాము నోటీసు జారీచేస్తామని, ఇది కూడా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విషయమేనని, ఎన్నికల కమిషన్ ఏం జవాబిస్తుందో చూద్దామని సిజెఐ చంద్రచూడ్ తెలిపారు.

ఈ సందర్భంగా గుజరాత్‌లోని సూరత్‌లో ఇటీవల జరిగిన పరిణామాలను గోపాల్ శంకరనారాయణన్ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొందరు నామినేషన్లు ఉపసంహరించుకోవడం, కొందరు పోటీ నుంచి తప్పుకోవడంతో బిజెపి అభ్యర్థిని పోలింగ్‌కు ముందే విజేతగా ప్రకటించిన పరిణామాన్ని దృష్టిలో ఉంచుకుని తాము దాఖలు చేసిన పిల్ చాలా ముఖ్యమైనదని సీనియర్ న్యాయవాది తెలిపారు.పిల్‌లో మరో ముఖ్యమైన అంశాన్ని కూడా పిటిషనర్ ప్రస్తావించారు. నోటా కన్నా తక్కువ ఓట్లను సాధించుకున్న అభ్యర్థిని ఐదేళ్లపాటు అన్ని ఎన్నికల నుంచి బహిష్కరించే విధంగా నిబంధనలు రూపొందించాలని ఇసిని ఆదేశించాలని పిటిషనర్ కోరారు. నోటాను కాల్పినిక అభ్యర్థిగా పేర్కొంటూ సరైన ప్రచారం కల్పించాలని కూడా పిటిషనర్ తన పిల్‌లో కోర్టును కోరారు.

# టిక్‌టాక్‌ను అమ్మడం లేదు.. అమెరికాకు తేల్చిచెప్పిన చైనా కంపెనీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఓ పాపులర్ వీడియో యాప్ అన్న విషయం తెలిసిందే. అయితే ఆ చైనీస్ యాప్‌పై అమెరికాలో ఓ చట్టాన్ని చేశారు. ఆ యాప్‌ను అమ్మివేయాలని లేదంటే బ్యాన్ చేస్తామని ఇటీవల అమెరికా హెచ్చరించింది. ఆ హెచ్చరికల నేపథ్యంలో టిక్‌టాక్ చైనీస్ కంపెనీ బైట్‌డ్యాన్స్ ఓ ప్రకటన చేసింది. టిక్‌టాక్‌ను అమ్మే ఆలోచన లేనట్లు ఆ సంస్థ వెల్లడించింది. బైట్‌డ్యాన్స్ కంపెనీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఈ విషయాన్ని పోస్టు చేసింది. అమెరికా ఉభయసభలు రూపొందించిన చట్టాన్ని కోర్టులో సవాల్ చేయనున్నట్లు ఇటీవల టిక్ టాక్ కంపెనీ తెలిపింది. టిక్‌టాక్‌ను అమ్మే లేదా బ్యాన్ చేసే చట్టంపై బుధవారం అధ్యక్షుడు బైడెన్ సంతకం చేశారు. బైట్‌డ్యాన్స్ కంపెనీపై చైనా ప్రభుత్వ ఆధిపత్యం ఏమీలేదని టిక్‌టాక్ పదేపదే వెల్లడించిన విషయం తెలిసిందే.

అమెరికా కోర్టులో టిక్‌టాక్ గురించి పోరాటం చేస్తామని దాని ఓనర్ షోవూ జి చివ్ తెలిపారు. ఓ ఆన్‌లైన్ వీడియోలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. బైట్‌డ్యాన్స్‌లో చైనీస్ వ్యవస్థాపకుడికి 20 శాతం మాత్రమే షేర్లు ఉన్నాయి. ఇక మరో 60 శాతం షేర్లు ఇన్వెస్టర్ల వద్ద ఉన్నాయి. దాంట్లో అమెరికా కంపెనీ కార్లిల్ గ్రూపు, జనరల్ అట్లాంటిక్, సుస్‌కెన్నా ఇంటర్నేషనల్ గ్రూపులు ఉన్నాయి. మరో 20 శాతం షేర్లు కంపెనీ ఉద్యోగుల ఆధీనంలో ఉన్నాయి. బైట్‌డ్యాన్స్‌లో ఉన్న అయిదుగురు బోర్డు సభ్యుల్లో ముగ్గురు అమెరికన్లే ఉన్నారు.

# జోరు మీదున్న మారుతి సుజుకి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సరికొత్త రికార్డులు నెలకొల్పింది. కమొడిటీ ధరలు సానుకూలంగా ఉండటంతోపాటు ఎస్‌యూవీ కార్ల్స్ పుంజుకోవడంతో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో మారుతి సుజుకి నికర లాభం 47.8 శాతం పెరిగింది. 2022-23 మార్చి త్రైమాసికంలో రూ.2,623.6 కోట్ల నికర లాభం గడించిన మారుతి సుజుకి.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.3,877.8 కోట్ల నికర లాభం పొందింది. ఈ నేపథ్యంలో వాటాదారులకు షేర్‌పై అత్యధికంగా రూ.125 డివిడెండ్ ఇవ్వాలని మారుతి సుజుకి డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. గతేడాది షేర్ పై రూ.90 డివిడెండ్ చెల్లించింది.

2022-23 మార్చి త్రైమాసికంతో పోలిస్తే 2023-24లో ఎస్‌యూవీ, మల్టీ పర్పస్ వెహికల్స్ 1.81 లక్షలు అమ్ముడయ్యాయి. మొత్తం కార్ల విక్రయాల్లో 71.5 శాతం వాటా వీటిదే. 2023 మార్చి త్రైమాసికంలో 24 శాతం పెరిగిన ఎస్‌యూవీ, మల్టీ పర్పస్ వెహికల్స్.. 2023-24 మార్చి త్రైమాసికంలో 36 శాతం పెరిగాయి. కంపెనీ నికర విక్రయాల విలువ రూ.30,821.8 కోట్ల నుంచి రూ.36,697.5 కోట్లకు పెరిగింది. 2022-23తో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో మారుతి సుజుకి లాభం 64 శాతం పుంజుకుని రూ.13.209.4 కోట్లకు చేరాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ సేల్స్ 20 శాతం పెరిగి రూ.1,34,937.8 కోట్లకు చేరాయి.


ఆహ్వానం

దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్యవేదిక

ఆధ్వర్యంలో



కొమ్మవరపు విల్సన్‌రావు కవితా సంపుటి

నాగలి కూడా ఆయుధమే పరిచయ సభ

ఏప్రిల్ 30, మంగళవారం

సాయంత్రం 6.00 గంటలకు (ఐఎస్‌టి)

వేదిక : జూమ్ (అంతర్జాలం)

సభాధ్యక్షులు

రాపోలు సీతారామరాజు (దక్షిణాఫ్రికా)

ముఖ్య అతిథి

గుడిపాటి, పాలపిట్ట సంపాదకులు

వక్తలు

యం.నారాయణశర్మ, ప్రముఖ కవి, విమర్శకులు

పి.శ్రీనివాస్‌గౌడ్, ప్రముఖ సాహితీవేత్త, అనువాదకులు

గౌతమ్ లింగా, (దక్షిణాఫ్రికా) ప్రముఖ కవి, విమర్శకులు

కవి స్పందన

విల్సన్‌రావు కొమ్మవరపు, సృజన క్రాంతి సాహితీ సంపాదకులు

అందరూ ఆహ్వానితులే

Meeting ID : 889 3243 4340 Passcode : 396592


# వేసవి దృష్ట్యా పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

అమరావతి, ఏప్రిల్ 26: వేసవి సెలవుల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక వారాంతపు రైళ్లను నడపనుంది. 07234 నంబర్ గల రైలు ఈనెల 28 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం సికింద్రాబాద్ నుంచి సంత్రగచి వరకు నడుస్తుందని విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంద్రూకర్ తెలిపారు.

ఈ రైలు రాత్రి 11.40 గంటలకు బయలు దేరి నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు , విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, అనకాపల్లి , విజయనగరం , శ్రీకాకుళం, బరంపూర్, భువనేశ్వర్, కటక్ , ఖరగ్‌పూర్ మీదుగా మంగళవారం ఉదయం 5 గంటలకు సంత్రగచికి చేరుకుంటుందని వివరించారు. ఇదే రైలు 07235 నంబర్‌తో ఈనెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు మంగళవారాల్లో సంత్రగచిలో మధ్యాహ్నం 12.20కు బయలు దేరి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందన్నారు. 18 బోగీలతో నడిచే ఈ రైళ్లలో ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం ఉండదని ఆయన వెల్లడించారు. యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా టికెట్లు తీసుకోవచ్చని సూచించారు.

# కాంగ్రెస్ పాలనలో బర్కత్ లేదు.. కేసీఆర్ పాలన లేక.. రాష్ట్రం ఆగమైంది: ఎమ్మెల్యే మల్లారెడ్డి




హైదరాబాద్, ఏప్రిల్ 26: నాడు నిండిన చెరువులు?పచ్చని చెట్లు.. పాడిపంటల్లో మాజీ సీఎం కేసీఆర్ కనిపించే వారని.. నేడు ఎండిన చెరువులు, కరువు కాటకాల్లో సీఎం రేవంత్ రెడ్డి కనిపిస్తున్నారని?.కేసీఆర్ పాలన లేక రాష్ట్రం ఆగమైందని? కాంగ్రెస్ అంటేనే కరువు? కష్టాలని.. ఐదు నెలల పాలనతో ప్రజలకు అర్థమైందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మెట్రోలో ప్రయాణించి..ఎన్నికల ప్రచారం చేశారు. ఎల్బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు ప్రయాణించిన వీరంతా.. ప్రయాణికులను ఆప్యాయంగా పలుకరిస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నగరాభివృద్ధిని వివరిస్తూ.. ఓట్లు అభ్యర్థించారు.

అనంతరం కూకట్‌పల్లి స్టేషన్‌లో వీరికి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన చరిత్ర అని.. అన్ని రంగాల్లో రాష్ట్రం నంబర్ వన్‌గా అభివృద్ధి చెందిందని, పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు.

రాష్ట్రంలోని గ్రామాల్లో క్రీడామైదానాలు, శ్మశానవాటికలు, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతుబంధు, దళితబంధు, వృద్ధులకు పింఛన్లు అందాయని, చెరువులను అభివృద్ధి చేయగా.. నిండు కుండల మారి.. చేవలు.. నీటితో కళకళలాడేవన్నారు. ప్రస్తుతం కేసీఆర్ పాలన లేక.. చెరువులన్నీ ఎండిపోయాయని, సునామీ కంటే ఘోరంగా పరిస్థితులన్నీ మారిపోయాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, హైదరాబాద్ విశ్వనగరంగా మారిందన్నారు.

చేతగాక.. తిట్లదండకం

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చిందని, గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు పరిపాలన చేతగాక.. బీఆర్ఎస్ పార్టీపై తిట్లదండకం అందుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పడంతో ప్రజలు మోసపోయి ఓట్లేశారని, ప్రజలు అమాయకులు కారని, ఈ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పడం ఖాయమని చెప్పారు.

కాంగ్రెస్ అంటేనే మోసం అని కాంగ్రెస్ అంటేనే కరెంట్, తాగునీటి కష్టాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గోవిందా.. అని ప్రజలకు అర్థమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, పేద ప్రజలకు బర్కత్ ఉండటం లేదని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులు లేక? కరీంనగర్, చేవెళ్ల నుంచి అభ్యర్థులను బరిలో దింపిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లోకల్ అని.. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలందరి మధ్యలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో 3.5 లక్షల మెజార్టీతో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కేసీఆర్‌కు మల్కాజిగిరి ఎంపీ స్థానాన్ని కానుకగా ఇస్తామన్నారు.

మల్కాజిగిరికి చేసిందేమీ లేదు..

ప్రజలు నమ్మి ఎంపీగా రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే మల్కాజిగిరికి చేసిందేమీ లేదని, ఒక్క రోజైనా.. ప్రజల కష్టాలు తెలుసుకోలేదని.. ఒక్కసారి కూడా ఇక్కడి ప్రజల కోసం మాట్లాడలేదని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మళ్లీ పరాయి వ్యక్తులను తీసుకొచ్చాయని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, శిరీషాబాబురావు, సబీహాబేగం, వందాల సతీష్‌గౌడ్, ముద్దం నర్సింహాయాదవ్, అవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, మహేశ్వరిశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# సౌర శక్తి కేంద్రంగా సిరిసిల్ల సెస్.. జర్మనీ సంస్థలతో చర్చలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 26: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల సెస్ (కోఆపరేటివ్ ఎలక్ట్రిసిటీ సప్లయ్ సొసైటీ)ని 100% సోలార్ సెంటర్‌గా మార్చాలని, తద్వారా స్థిరీకరణకు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ చెన్నమనేని రమేష్‌బాబు శుక్రవారం జర్మనీలోని వివిధ సంస్థలతో చర్చించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చెన్నమనేని రమేష్ చైర్మన్, డాక్టర్ డైటర్ కాన్‌స్టింగ్, డాక్టర్ మార్టిన్ ష్మీడర్, డాక్టర్ రఘు చలిగంటి (జర్మనీ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్) సమన్వయ బృందం సభ్యులు బెర్లిన్‌లో సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయించారు. భారత్, జర్మనీలు పరస్పర సంబంధాలతో అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు.

దశల వారీగా 2.98 లక్షల విద్యుత్ వినియోగదారులను విద్యుత్ ఉత్పత్తిదారులుగా పునర్వ్యవస్థీకరించడం ఈ దీర్ఘకాలిక ప్రణాళిక లక్ష్యం.

దీని ద్వారా, సెస్ ఆర్థిక స్వావలంబన స్థిరీకరణతో పాటు, వినియోగదారుల ఆర్థిక ఆదాయం (విద్యుత్ నికర విక్రేతలు), పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

ఇందుకోసం జూన్ నెలలో సమగ్ర నివేదిక రూపొందించి ఆగస్టు నెలలో హైదరాబాద్ కు వచ్చే జర్మనీ బృందంతో సెస్సు, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ ప్రైవేట్ రంగ మేనేజర్లతో చర్చలు జరపాలని నిర్ణయించారు. ఈ దిశగా మార్చి 27న సంబంధిత మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుతో ప్రాథమిక చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా డా.చెన్నమనేని రమేష్ మాట్లాడుతూ 54 ఏళ్ల క్రితం ఫోర్డ్ సహకారంతో ఏర్పాటైన సెస్ 1969 నుంచి ఈ ప్రాంతంలో మండల పరిధిలోని అన్ని గ్రామాలకు 100శాతం విద్యుత్‌ను అందించి చరిత్ర పుటల్లోకి ఎక్కిన తొలి విప్లవాత్మక కార్యక్రమం అన్నారు. ప్రస్తుతం, సెస్సు సభ్యుల సహకారంతో, విద్యుత్ వినియోగదారులను ఉత్పత్తిదారులుగా మార్చే ఈ వినూత్న కార్యక్రమం రెండవ విప్లవాత్మక మార్పుగా మారే అవకాశం ఉందని? దీనికి సహకరించాలని ఆయన కోరారు.

# 'నువ్వే గెలుస్తున్నావన్నా" ఈటల రాజేందర్ తో మల్లా రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బిజెపి ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఏ మల్లా రెడ్డి ఓ పెళ్లి వేడుకల్లో రాజేందర్ వద్దకు వెళ్లి "నువ్వే గెలుస్తున్నావన్నా" అంటూ వ్యాఖ్యానించడం ఇప్పుడు వైరల్ గా మారింది. మల్కాజిగిరిలో బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డితో ఈటల పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈటల గెలుస్తారని మల్లారెడ్డి అనడం వైరల్ గా మారింది.



ఆహ్వానము

## అచ్చంగా ఐదు పుస్తకాల ఆవిష్కరణ సభ

శనివారం 27 ఏప్రిల్ 2024
వేదిక : స్పైసీహబ్ హోటల్, కొత్తపేట, హైదరాబాద్.

**మొదటి సెషన్**
ఉదయం 10.00 - 11.30 వరకు
" చిత్రకళా తపస్వి డా. కొండపల్లి శేషగిరిరావు కీ జీవన్ గాథా"
హిందీ అనువాద గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం
స్వాగత వచనాలు
మాడిశెట్టి గోపాల్, కవి
సభాధ్యక్షులు
డాక్టర్ ఓలేటి పార్వతీశం
దూరదర్శన్ విశ్రాంత సంచాలకులు
ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త
ఆచార్య ఎన్ .గోపి
కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత,పూర్వ ఉపకులపతి,తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి
నరేంద్రరాయ్
ప్రముఖ చిత్రకారులు
ఆత్మీయ అతిథి
వారాల ఆనంద్
కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత
గ్రంథ అనువాద రచయిత: డాక్టర్ మరింగంటి లక్ష్మణాచార్యులు, కవి, రచయిత, అనువాదకులు
మూల రచయిత: డాక్టర్ కొండపల్లి నీహారిణి, కవయిత్రి, రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు
స్పందన కొండపల్లి వేణుగోపాల్ రావు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్
వందన సమర్పణ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, కవి

**రెండవ సెషన్**
మధ్యాహ్నం 11.30 - 1.00 గంటల వరకు
డాక్టర్ కొండపల్లి నీహారిణి రచించిన
"అనివార్యం"
స్త్రీవాద సాహిత్య విమర్శ వ్యాస సంపుటి పుస్తక ఆవిష్కరణ
స్వాగత వచనాలు
కె ఎస్ అనంతాచార్యులు, కవి
సభాధ్యక్షులు
డాక్టర్ సూర్య ధనంజయ్
సీనియర్ ప్రొఫెసర్, తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆవిష్కర్త
డాక్టర్ ముదిగంటి సుజాత రెడ్డి
రచయిత్రి, తెలంగాణ సారస్వత పరిషత్ ఉపాధ్యక్షులు
ముఖ్య అతిథి
ఆచార్య కొలకలూరి ఇనాక్
పద్మశ్రీ అవార్డు గ్రహీత, పూర్వ ఉపకులపతి, ఎస్వీ యూనివర్సిటీ
విశిష్ట అతిథి
ఆచార్య మసన చెన్నప్ప
కవి, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు
డాక్టర్ గంద్ర లక్ష్మణ రావు
కవి, రచయిత
జ్వలిత
కవయిత్రి, బహుళ అంతర్జాల పత్రిక సంపాదకులు
అన్నవరం దేవేందర్
కవి, రచయిత
వందన సమర్పణ
చెన్నోజ్వల పద్మశ్రీ, కవయిత్రి

మధ్యాహ్నం 1 .00 - 1.30 భోజన విరామం

**మూడవ సెషన్**
మధ్యాహ్నం 1.30 - 3.00 గంటల వరకు
"కథా మయూఖం", " బాల కథా మయూఖం"
మయూఖ అంతర్జాల పత్రిక కథా సంకలనాల ఆవిష్కరణ
స్వాగత వచనాలు
మాడిశెట్టి గోపాల్, కవి
సభాధ్యక్షులు
నెల్లుట్ల రమాదేవి, కవయిత్రి, రచయిత్రి, కార్టూనిస్ట్
ఆవిష్కర్త
డాక్టర్ అమృతలత
రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత
ముఖ్య అతిథి
బైస దేవదాస్, నేటి నిజం పత్రికాధిపతి, సంపాదకులు
విశిష్ట అతిథి
డాక్టర్ సి. మృణాళిని
రచయిత్రి , తెలుగు విశ్వవిద్యాలయం సిలికానాంధ్ర ఆచార్యులు
గౌరవ అతిథులు
డాక్టర్ చిల్లర భవానీ దేవి
కవయిత్రి,రచయిత్రి
వేదాంత సూరి
'మొలక' పత్రిక సంపాదకులు
డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ
కవి, రచయిత, సినీ గేయ రచయిత
ఆత్మీయ అతిథి
డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్
కవి, రచయిత, విమర్శకులు, పాలపిట్టపత్రిక సహ సంపాదకులు
స్పందన
డాక్టర్ కొండపల్లి నీహారిణి, ' మయూఖ'," తరుణి " పత్రిక సంపాదకులు
వందన సమర్పణ నరేష్ చారి , కవి

**నాలుగవ సెషన్**
మధ్యాహ్నం 3.00 నుండి 4.30 వరకు
" మిగిలేవి గురుతులే"
ధూళిపాళ అరుణ రచించిన కథా సంపుటి ఆవిష్కరణ
స్వాగత వచనాలు కె.ఎస్ అనంతాచార్య, కవి
సభాధ్యక్షులు నెల్లుట్ల రమాదేవి
కవయిత్రి, రచయిత్రి, కార్టూనిస్ట్
ముఖ్య అతిథి, పుస్తకావిష్కర్త
డాక్టర్ నందిని సిధారెడ్డి
కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు
కృతి స్వీకర్త
శ్రీ ఒద్దిరాజు మురళీధరరావు రచయిత, అనువాదకులు, లెక్చరర్ (రి)
విశిష్ట అతిథి
విహారి, కవి, రచయిత, సాహిత్య విమర్శకులు
గౌరవ అతిథి
డాక్టర్ నాళేశ్వరం శంకరం
కవి, రచయిత, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు
ఆత్మీయ అతిథులు
కందుకూరి శ్రీరాములు
కవి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ అధ్యక్షులు
బెల్లం కొండ సంపత్
కవి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ కార్యదర్శి
డాక్టర్ కొండపల్లి నీహారిణి
కవయిత్రి, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఉపాధ్యక్షురాలు
వందన సమర్పణ నక్క హరికృష్ణ, కవి

# బీజేపీ అంటే భారతీయ ఆత్మ

**-కేసీఆర్ తెలంగాణ ఆత్మ కాదు, రాష్ట్రానికి పట్టిన శని**
**-దళితుల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నది మోదీ ప్రభుత్వమే**
**-అంబేద్కర్ ను అవమానించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లను బుద్ధి చెప్పండి**
**-మానకొండూరు 'దళిత సమ్మేళనం'లో బండి సంజయ్ వ్యాఖ్యలు**

కరీంనగర్, ఏప్రిల్ 26: (నేటినిజం ప్రతినిధి) బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఐఎన్ సీ అంటే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ పార్టీ ఇండియాది కాదని, బ్రిటోషోడు స్థాపించారని చెప్పారు. శుక్రవారం నాయకులు సురేష్, శ్రీనివాస్, సొల్లు అజయ్ వర్మ , సోమిడి వేణు ప్రసాద్ , రాపాక ప్రవీణ్ లతోపాటు బిజెపి నాయకులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, బొంతల కళ్యాణ్ చంద్ర, కటకం లోకేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ అలన్ ఆక్టేవియన్ హ్యూమ్ అనే బ్రిటీష్ సివిల్




బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మానుకొండూరులో నిర్వహించిన 'దళిత సమ్మేళనం'కు బండి సంజయ్ తోపాటు ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, మాజీ అధ్యక్షులు కొప్పు భాష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర సర్వంట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. 'బ్రిటీష్ పార్టీని ఇటలీ నేత ఏలుతున్నరని, పేరులోనే భారతీయతను సంతరించుకున్న పార్టీ బీజేపీ అన్నారు. ఈ దేశ ముద్దు బిడ్డలు వాజ్ పేయి, అద్వానీ స్థాపించిన పార్టీ బీజేపీ అన్నారు. మరి కాంగ్రెస్ లో భారతీయత ఎక్కడుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ను ఏలుతున్న గాంధీ కుటుంబం డూప్ అని, మహాత్మాగాంధీ అసలు సిసలైన గాంధీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పొరపాటున అధికారంలోకి వస్తే, పేదలు సహా ఎవరు చనిపోయినా వారి ఆస్తిలో 55 శాతం కాంగ్రెస్ గుంజుకోవాలని కుట్ర చేస్తోందని హెచ్చరించారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ విదేశాంగ విభాగం ఇంఛార్జీ శ్యాం పిట్రోడా స్పష్టం చేశారని గుర్తు చేశారు. మోదీ హయాంలోనే దేశానికి, ధర్మానికి రక్ష అన్నారు. ఈ దేశంలో శాంతిభద్రతలు కొనసాగుతున్నాయంటే, దేశం సురక్షితంగా ఉందంటే అది మోదీ చలువేనని, ఏ జవాన్ ను అడిగినా చెబుతారని పేర్కొన్నారు. 57 ఏళ్లు దేశాన్ని పాలించిన పార్టీ ఏనాడూ దళితుల అభ్యున్నతికి పనిచేయలేదన్నారు. అంబేద్కర్ ను అడుగడుగున అవమానించిన పార్టీ బీజేపీ అని, పార్లమెంట్ లో దళితుల హక్కులపై మాట్లాడుతున్న అంబేద్కర్ ను అడ్డుకున్న వ్యక్తి జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. రాజీనామా చేసి బయటకు వచ్చి పోటీ చేస్తే అనేక కుట్రలు చేసి అంబేద్కర్ ను ఓడించి దారుణంగా అవమానించిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. అంబేద్కర్ మరణిస్తే ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీలో ఉంచకుండా ముంబయి తరలించి అవమానించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఎన్నికలప్పుడే తప్ప ఏనాడూ దళితులను పట్టించుకోని మోసపూరిత పార్టీ కాంగ్రెస్ అన్నారు.

తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్న కేసీఆర్ దళితులను మోసం చేశారన్నారు. మాట ఇస్తే తల నరుక్కుంటానే తప్ప మాట తప్పనన్న కేసీఆర్ ఎన్నడైనా మాట మీద నిలబడ్డారా అని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఓట్లు దండుకుని చివరకు అభివృద్ధి పేరుతో దళితుల భూమినే గుంజుకున్న చోర్ కేసీఆర్ అన్నారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు కూడా హాజరుకాని అహంకారి కేసీఆర్ అని, ఆనాడు కనీసం దళిత సంఘాలు కేసీఆర్ ను నిలదీయకపోవడం బాధాకరం అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని తూచ తప్పకుండా అమలు చేసే పార్టీ బీజేపీ అని, రాజ్యాంగాన్ని మారుస్తామని ఏ ఫాల్తుగాడు అన్నా సహించేది లేదన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న మహానేత మోదీ అని, ప్రధాని పదవి అంబేద్కర్ భిక్షేనని, నిండు పార్లమెంట్ లో చాటి చెప్పిన నేత మోదీ అన్నారు. పూచీకత్తు లేకుండా బ్యాంకుల ద్వారా రూ.5 కోట్ల రునాలిస్తూ, ప్రతి ఏటా 1.25 లక్షల మందిని పారిశ్రామిక వేత్తలుగా మారుస్తున్న ప్రభుత్వం బీజేపీదేనన్నారు. కాంగ్రెస్ హయాంలో 50 మందికి మించి విదేశీ విద్యను అభ్యసించే అవకాశం లేకపోతే, ఆ సంఖ్యను వందల్లో పెంచిన నాయకుడు మోదీ అన్నారు. విద్యార్థుల స్కాలర్ షిప్పుల కోసం రూ.50 వేల కోట్లను కేటాయించిన సర్కార్ మోదీదేనని, ఆ స్కాలర్ షిప్పుల సొమ్ములో 40 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరినా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. నేరుగా తనకే దళితుల సొమ్ము ఇవ్వాలని కండిషన్ పెట్టి దళితులను చదువుకు దూరం చేసిన దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు. అందుకే కేసీఆర్ కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారన్నారు. 'ఇందిర అభయ హస్తం పేరుతో ఎన్నికల మేనిఫెస్టోలో ఒక్కో ఎస్సీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, ఇందిరమ్మ పథకం పేరుతో ఇంటి జాగా, రూ.6 లక్షల సాయం చేస్తాం' అని హామీ ఇచ్చి మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీజేపీ ఏనాడూ హామీ ఇవ్వకపోయినా దళితుడు రామ్ నాథ్ కోవింద్ ను, గిరిజన ఆదివాసీ పేద మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని, 12 మంది ఎస్సీలను, 8 మంది ఎస్టీలను, 27 మంది బీసీలను కేంద్ర మంత్రులుగా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. అంతకుముందు 57 ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఏనాడైనా దళితులను రాష్ట్రపతి చేసిందా పెద్ద ఎత్తున దళితులకు కేబినెట్ లో చోటు కల్పించిందా సమాధానం చెప్పాలి అన్నారు. బీజేపీ మూలాలన్నీ భారత్ లోనే ఉన్నయ్. వాజ్ పేయి, అద్వానీ బీజేపీని స్థాపించారన్నారు. మరి బ్రిటీష్ జనతా పార్టీ ఎట్లయితదని, అసలు కాంగ్రెస్ వ్యవస్థాపకుడు ఎవరని, ఏవో హ్యూమ్ అనే వ్యక్తి అన్నారు. బ్రిటీషోడు స్థాపించిన పార్టీకి నాయకత్వం వహిస్తున్న గాంధీ కుటుంబం డూప్ అన్నారు. మహాత్మాగాంధీ మనకు అసలు సిసలైన గాంధీ అని, ఇప్పుడున్న గాంధీ కుటుంబం మూలాలు ఇటలీ దేశానివన్నారు. ఐఎన్ సీ అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని, ఇటలీ నేషనల్ కాంగ్రెస్ అన్నారు. ఎందుకంటే సోనియా పుట్టి పెరిగింది ఇటలీలోనే అన్నారు. కాంగ్రెస్ మూలాలు అక్కడివే అన్నారు.

# కాంగ్రెస్, బిజెపి పార్టీలకు కరీంనగర్‌లో ఓటేసే పరిస్థితి లేదు

**-పార్లమెంటు ఎన్నికల్లో వినోద్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలి-ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



కరీంనగర్, ఏప్రిల్ 26: (నేటినిజం ప్రతినిధి) రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి బోయిని పల్లి వినోద్ కుమార్ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కరీంనగర్ ఎమ్మెల్యే మాజీమంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ సమావేశం నిర్వహించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గంలో తనను 20 సంవత్సరాలుగా ఆదరిస్తున్నారని.. ఒకసారి కౌన్సిలర్ గా ఒకసారి కార్పొరేటర్ గా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని.. ప్రతి ఎన్నికలోను నాయకులు కార్యకర్తలు తనకు అండగా నిలిచారని.గుర్తు చేశారు... పార్లమెంటులో ప్రశ్నించే గొంతు ఉండాలని...ఈ పార్లమెంటు ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమైనవని అని అన్నారు...వినోద్ కుమార్ గారిని భారీ మెజారిటీతో గెలిపిస్తే ఎమ్మెల్యేగా తాను ఎంపీగా వినోద్ కుమార్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి నిధులు తీసుకొచ్చి కరీంనగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు . ఎమ్మెల్యే,ఎంపి ఒకే పార్టీ వారైతే అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందని అన్నారు.. కరీంనగర్ లో కాంగ్రెస్, బీజేపీ పార్టీల కు ఓటేసే పరిస్థితి లేదని అన్నారు.. ప్రతి కార్యకర్త గ్రామాల్లో గడపగడపకు వెళ్లి 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలన గురించి వివరించాలని అన్నారు.. బిజెపి పార్టీ దేవుని పేరు చెప్పి ఓట్లు దండుకునుడు తప్ప.. నియోజకవర్గంలో పావు కిలోమీటర్ కూడా రోడ్డు వేయలేదని ఎద్దేవా చేశారు..

నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చూశామని.. ఆచరణ సాధ్యం గాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని అన్నారు.. గ్రామాల్లో రైతులు టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బి ఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి×వినోద్ కుమార్ మాట్లాడుతూ×.నేను మీ మనిషిని... మీకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్. బిజెపి నాయకులు కుల మతవిద్వేషాలను రెచ్చగొట్టి... పిల్లల భవిష్యత్ ను సర్వనాశనం చేస్తున్నారని ఆందోళనవ్యక్తం చేశారు. నేను హిందువును అని చెప్పుకునే బండి సంజయ్... కరీంనగర్ కు ఒక గుడి తేలేదు బడి తేలేదన్నారు. కానీ... నేను గంగుల కలిసి కరీంనగర్ కు టిటిడి... ఇస్కాన్ టెంపుల్ తెచ్చామన్నారు. టిటిడి టెంపుల్ నిర్మాణాన్ని వంద కోట్ల విలువచేసే భూమిలో... 50 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. అంతే కాకుండా కరీంనగర్ కు స్మార్ట్ సిటి... రైల్వే లైన్... జతీయ రహదారులు తెచ్చిన ఘనత కూడా మాదేనన్నారు. బిఆర్ఎస్ శ్రేణులు... ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని... గ్రామాల్లో చర్చ పెట్టి బిఆర్ఎస్ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బిజెపిలకు రైతులు వ్యతిరేకంగా మారడంతో... పరిస్థితులు మనకు అనుకూలంగా మారాయని... కొద్దిగా కష్టపడితే మెజార్టీ వస్తుందన్నారు. ఇప్పుడు మమ్మల్ని గెలిపిస్తే... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని మేము గెలిపించుకుంటామని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య పిల్లి శ్రీలత- మహేష్ ' తోట తిరుపతి కరీంనగర్, కొత్తపల్లి మండల అధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి కాసారపు శ్రీనివాస్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డి మధు కో ఆప్షన్ సభ్యులు సాబీర్ పాషా, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్ సుంకిశాల సంపత్ రావుతదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్



కరీంనగర్, ఏప్రిల్ 26: కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో కలిసి శుక్రవారం మార్నింగ్ వాక్ లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీగా గెలిపించాలని వినోద్ కుమార్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ కార్పొరేటర్లు తోటరాములు,ఐలేందర్ యాదవ్ నాయకులుకలర్ సత్తన్న, సత్తినేని శ్రీనివాస్, వొల్లాల శ్రీనివాస్ గౌడ్, బెజిగం మధు, చొక్కారపు చంద్రం, రవి నాయక్, కెమసారం తిరుపతి, జీఎస్ ఆనంద్, గూడెల్లి రాజకుమార్, అంజి యాదవ్ పాల్గొన్నారు

# దక్షిణ భారతదేశ పునరుత్పాదక ఇంధన విప్లవాన్ని విజయవంతంగా ఆవిష్కరించిన రెన్యూఎక్స్ 2024




హైదరాబాద్, ఏప్రిల్ 26: ప్రముఖ బి2బి ఎగ్జిబిషన్ ఆర్గనైజర్ ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా, ఈరోజు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రెన్యూఎక్స్ 8వ ఎడిషన్‌ను విజయవంతంగా ప్రారంభించింది. పర్యావరణ అనుకూల మరియు హరిత విద్యుత్ పై దృష్టి సారించి దక్షిణ భారతదేశపు పునరుత్పాదక ఇంధన ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పో లో 5000 మంది సందర్శకులు 150+ దేశీయ మరియు అంతర్జాతీయ ఎగ్జిబిటర్లు చేసిన ఆవిష్కరణలను అన్వేషించారు. ఈ ఎక్స్‌పో ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీ భాగ్యతేజ్ రెడ్డి, డైరెక్టర్ పవర్ & యుటిలిటీస్, పిడబ్ల్యుసి , శ్రీ. ఎన్ జానయ్య, వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్; శ్రీ అజయ్ మిశ్రా, ఐఏఎస్ , ప్రస్తుతం ఛైర్మన్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర సలహాదారు, ఎనర్జీ కమిటీలు, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, హైదరాబాద్; శ్రీ యోగేష్ ముద్రాస్, మేనేజింగ్ డైరెక్టర్, ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా మరియు శ్రీ రజనీష్ ఖట్టర్, సీనియర్ గ్రూప్ డైరెక్టర్, ఎనర్జీ పోర్ట్‌ఫోలియో, ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా తో సహా ప్రముఖులు హాజరయ్యారు. ఇన్ఫార్మా మార్కెట్స్ ఇండియా , మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ, "రెన్యూఎక్స్ అనేది దక్షిణ భారతదేశంలో పునరుత్పాదక ఇంధనం కోసం నిర్వహిస్తున్న ముఖ్యమైన ప్రదర్శన . పర్యావరణ అనుకూల ఇంధన పరిష్కారాల పట్ల భారతదేశం యొక్క నిబద్ధతను మరియు పునరుత్పాదక ఇంధన రంగంలో దాని నాయకత్వాన్ని నొక్కిచెప్పే ఆవిష్కరణలు మరియు వ్యవస్థాపక వెంచర్లు ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. రెన్యూఎక్స్ 2024లో భాగంగా సీఈఓ రౌండ్‌టేబుల్‌తో సహా పలు కాన్ఫరెన్స్‌లు సైతం జరుగనున్నాయి" అని అన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఎల్లమ్మ సిద్దోగ ఆహ్వానం



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 26: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామం లో నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్దోగా మహోత్సవానికి రావలసిందిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు శుక్రవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకలాభరణ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్ గౌడ్, గౌడ సంఘ అధ్యక్షులుమంద నారాయణ గౌడ్, సంఘం నాయకులు పొన్నం ధర్మయ్య, మంద దుర్గయ్య, సత్యం చంద్రయ్య ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.